
ANDHRAJYOTHY

ఆంధ్రజ్యోతి




అన్నమయ్య

జిల్లా వార్తలు

5

ఆదివారం 16 మార్చి 2025



హౌసింగ్‌కు ‘పొసెషన్’ మెలిక

- మంజూరుకు రెవెన్యూ మీనమేషాలు
- తలలు పట్టుకుంటున్న హౌసింగ్ అధికారులు
- జిల్లాలో 30 వేల మంది లబ్ధిదారులకు ఇబ్బందులు

పేదల హౌసింగ్ ఇళ్ల నిర్మాణాలకు ప్రభుత్వం కేటాయిస్తున్న నిధులు పెంచడంతో పాటు నిధుల కేటాయింపునకు స్థలాల అనుభవ ధ్రువీకరణ పత్రం (పొసెషన్) సర్టిఫికెట్లు ఉండాలని మెలిక పెట్టింది. రెవెన్యూ అధికారులేమో స్థలాలకు పొసెషన్ సర్టిఫికెట్ల మంజూరులో ఆలస్యం చేస్తున్నారని లబ్ధిదారులు వాపోతున్నారు. దీంతో జిల్లాలో సుమారు 30 వేల మంది హౌసింగ్ లబ్ధిదారులను గుర్తించినా వారికి పొసెషన్ సర్టిఫికెట్లు లేక హౌసింగ్ నిధులు మంజూరు కావడం లేదు.



అంకిశెట్టిపల్లెలో సొంత స్థలానికి పొసెషన్ సర్టిఫికెట్ మంజూరు చేయాలని కోరుతున్న లబ్ధిదారురాలు సుమతి



మదనపల్లె మండలం అంకిశెట్టిపల్లెలో సొంత స్థలం ఉన్న సాలమ్మ వివరాలు నమోదు చేస్తున్న హౌసింగ్ అధికారి

మదనపల్లెటౌన్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): పేదలకు హౌసింగ్ పథకంలో ఒకటిన్నర సెంటు స్థలం, రూ.1.50 లక్షల నిధులు కేటాయిస్తామని వైసీపీ ఐదేళ్ల పాలనలో ఊకదంపుడు ఉపన్యాసాలు ఇచ్చారు. 90 రోజుల్లో ఇళ్ల స్థలాల పేరిట గుట్టల్లో, చెరువుల్లో లబ్ధిదారులకు ఒకటిన్నర సెంట్ల చొప్పున స్థలాలు కేటాయించారు. తీరా చూస్తే అప్పటి ప్రభుత్వం మంజూరు చేసిన రూ.150 లక్షల నిధులు కేవలం పునాదుల నిర్మాణాలకే సరిపోయాయి. గోడల నిర్మాణం, ఇంటి పైకప్పు నిర్మాణాలకు లబ్ధిదారులు అప్పులు చేయాల్సిన పరిస్థితి తలెత్తింది. కానీ రాష్ట్రంలో ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఎన్టీఆర్ హౌసింగ్ పథకంలో లబ్ధిదారులకు గ్రామీణ ప్రాంతాల్లో ఒక్కొక్కరికి మూడు సెంట్లు, అర్బన్ ప్రాంతాల్లో రెండున్నర సెంట్ల చొప్పున ఇంటి స్థలాలు కేటాయిస్తున్నారు. అంతేకాకుండా హౌసింగ్‌లో ఇచ్చే నిధులు ఒక్కో లబ్ధిదారుకు రూ.2.50 లక్షలకు పెంచారు. వీటికి తోడు బీసీ, ఎస్సీ కులాల లబ్ధిదారులకు అదనంగా రూ.50 వేలు, ఎస్టీ కులానికి చెందిన లబ్ధిదారులకు అదనంగా రూ.75 వేలు ఆర్థికసాయం అందిస్తున్నారు. ఈ క్రమంలో హౌసింగ్ పథకం అమలు వేగం పుంజుకుంటుంది అనుకున్నారు.

సబ్ కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లాం

హౌసింగ్ పథకంలో సొంత స్థలాలు ఉన్న లబ్ధిదారుల పొసెషన్ సర్టిఫికెట్ సమస్యపై మదనపల్లె సబ్‌కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లాం. సొంత స్థలాలకు పొసెషన్ సర్టిఫికెట్ల మంజూరులో జాప్యంపై తహసీల్దార్‌లకు తగిన సూచనలిస్తామని, వాటిని వేగవంతం అయ్యేలా చర్యలు తీసుకుంటామని సబ్‌కలెక్టర్ హామీ ఇచ్చారు. వారంలో సాధ్యమైనంత ఎక్కువ పొసెషన్ సర్టిఫికెట్లు వస్తే లబ్ధిదారులకు హౌసింగ్ నిధులు కేటాయించి ఇళ్ల నిర్మాణాలను మొదలుపెడతాం.

- రమేష్‌రెడ్డి, హౌసింగ్ ఇన్‌చార్జి ఈఈ, మదనపల్లె

పొసెషన్ సర్టిఫికెట్ల మెలిక

హౌసింగ్ పథకంలో లబ్ధిదారులు బీసీ, ఎస్సీ, ఎస్టీ కుల ధ్రువీకరణ పత్రాలతో పాటు, ఆదాయ ధ్రువీకరణపత్రాలు, వారి అనుభవంలో ఉన్న స్థలాలకు రెవెన్యూ అధికారులచే పొసెషన్ సర్టిఫికెట్లు జతచేయాలని నిబంధన పెట్టారు. దీంతో లబ్ధిదారులు కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలతో పాటు స్థలాల పొసెషన్ సర్టిఫికెట్ల కోసం తహసీల్దార్ కార్యాలయాలకు తిరుగుతూనే ఉన్నారు. ఇక్కడ చూస్తే కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాల మంజూరులో లబ్ధిదారులకు అంతగా ఇబ్బందులు రావడం లేదు, కానీ స్థలాల పొసెషన్ సర్టిఫికెట్ల మంజూరులో రెవెన్యూ అధికారులు యక్ష ప్రశ్నలు వేస్తున్నారు. స్థలానికి సంబంధించి రిజిస్ట్రేషన్, అగ్రిమెంట్లు ఉండాలని, డీకేటీ, గ్రామ కంఠం భూములకు ఇవ్వమని చెబుతున్నారు. గ్రామాల్లో పేద రైతులకు వారి పొలాల వద్ద హౌసింగ్ ఇంటి నిర్మాణానికి స్థలాలు ఉన్నా ఆ భూములకు వన్-బి ఉండటంతో 3 సెంట్ల స్థలానికి ఎలా పొసెషన్ సర్టిఫికెట్లు ఇస్తామని రెవెన్యూ అధికారులు తిరకాసు పెడుతున్నారు. దీంతో లబ్ధిదారులు తమ గోడు ఎవరికి చెప్పుకోవాలంటూ ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

30 వేలకు పైగా ఇళ్ల స్థలాల కోసం వెతుకులాట

జిల్లాలోని అన్ని మండలాల్లో రెండు నెలలుగా 30 వేల మంది లబ్ధిదారులకు హౌసింగ్ పథకంలో ఇళ్ల స్థలాలు కేటాయించడానికి అటు రెవెన్యూ, ఇటు హౌసింగ్ అధికారులు మల్లాగుల్లాలు పడుతున్నారు. సొంత స్థలాలు ఉన్న లబ్ధిదారులకు హౌసింగ్ పథకంలో ఇంటి నిర్మాణం మంజూరు చేద్దామంటే వారికి ఆ స్థలాలకు పొసెషన్ సర్టిఫికెట్ మెలిక పెట్టడంతో అవి అలాగే నిలిచిపోతున్నాయి. మదనపల్లె హౌసింగ్ డివిజన్‌లో 12,201 మంది లబ్ధిదారులను గుర్తించారు. వీరిలో 5,400 మందికి సొంత ఇంటి స్థలాలు ఉన్నాయి. మిగిలిన 6,800 మందికి ప్రభుత్వమే ఇంటి స్థలాలు వెతికి కేటాయించాల్సి ఉంది. రాయచోటి, రాజంపేట, పీలేరు, రైల్వేకోడూరు హౌసింగ్ డివిజన్‌లలో కూడా ఇదే పరిస్థితి కొనసాగుతోంది. మొత్తం మీద సుమారు 30 వేల మంది లబ్ధిదారులకు ఇళ్లస్థలాలు మంజూరు చేయాల్సి ఉండగా, 16 వేల మంది లబ్ధిదారుల సొంత స్థలాలకు రెవెన్యూ అధికారులు పొసెషన్ సర్టిఫికెట్లు మంజూరు చేయాల్సి ఉంది.

తలలు పట్టుకుంటున్న హౌసింగ్ అధికారులు

జిల్లాలో హౌసింగ్ పథకంలో లబ్ధిదారులకు ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయండి. ప్రతి వారం రోజులకు ఈ పథకంలో సాధించిన ప్రగతి నివేదికలు ఇవ్వండి అంటూ హౌసింగ్ ఉన్నతాధికారులు కింది స్థాయి అధికారుల వెంట పడుతున్నారు. అన్నీ సక్రమంగా ఉంటే ఈ పాటికి హౌసింగ్ ఇళ్ల నిర్మాణాలు పునాదులు దాటి గోడల స్థాయికి వచ్చి ఉండేవి. కానీ లబ్ధిదారుల సొంత స్థలాలకు పొసెషన్ సర్టిఫికెట్లు ఉంటేనే హౌసింగ్ నిధులు మంజూరు చేయాలనే నిబంధన ఉండటంతో ఇక్కడే ఈ పథకం ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా నిలిచిపోయింది. దీంతో ఉన్నతాధికారులకు సమాధానాలు చెప్పలేక, రెవెన్యూ అధికారులను ప్రాధేయపడలేక హౌసింగ్ అధికారులు తలలు పట్టుకుంటున్నారు. ఇప్పటికైనా జిల్లా రెవెన్యూ ఉన్నతాధికారులు ఈ సమస్యలపై స్పష్టమైన నిర్దేశాలు జారీ చేసి హౌసింగ్ పథకం ముందుకు సాగేందుకు చర్యలు చేపట్టాల్సి ఉంది.



స్వామి వారికి పుష్పయాగం చేస్తున్న వేద పండితులు

వైభవంగా పుష్పయాగం

గుర్రంకొండ, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తరిగొండలో కొలువైన లక్ష్మీనరసింహస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా శనివారం వేద పండితులు పుష్పయాగాన్ని వైభవంగా చేశారు. ఉదయం ఉత్సవమూర్తులకు స్నపన తిరుమంజనాన్ని శాస్త్రోక్తంగా చేశారు. సాయంత్రం టీటీడీ నుంచి వచ్చిన వివిధ రకాల పూలతో స్వామి వారికి పుష్పయాగాన్ని ఘనంగా చేశారు. పుష్పయాగంతో పది రోజులు పాటు జరిగిన బ్రహ్మోత్సవాలు ముగిశాయి. పుష్పయాగాన్ని తిలకించడానికి భక్తులు అధికంగా వచ్చారు. కార్యక్రమంలో ఆలయాధికారి కృష్ణమూర్తి, అర్చకులు గోపాల్‌భట్టర్, కృష్ణరాజ్, కృష్ణప్రసాద్, అనిల్, గోకుల్, వరద, ధనుష్, నరసింహులు, వెంకీ సిబ్బంది నాగరాజ తదితరులు పాల్గొన్నారు.



పుష్పయాగానికి టీటీడీ నుంచి తెచ్చిన వివిధ రకాల పూలు

టీడీపీ నేత హత్య దారుణం

- పోలీసుల నిర్లక్ష్యమే ఈ హత్యకు కారణం : ఎమ్మెల్యే అమరనాథరెడ్డి

6

భక్తకన్నప్ప ఆలయాన్ని అభివృద్ధి చేస్తా

- సినీ హీరో మంచు విష్ణు

రాజంపేట, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): భక్తకన్నప్ప ఆలయాన్ని అన్నివిధాలుగా అభివృద్ధి చేసేందుకు నా వంతు కృషి చేస్తానని సినీ హీరో మంచు విష్ణు తెలిపారు. రాజంపేట మండలం భక్తకన్నప్ప జన్మస్థలి ఊటుకూరులోని భక్తకన్నప్ప ఆలయంలో మంచు విష్ణు శనివారం ప్రత్యేక పూజలు చేశారు. భక్తకన్నప్ప సినిమా యూనిట్ సభ్యులతో కలిసి ఆలయాన్ని సందర్శించారు. ఆయనకు స్థానిక గ్రామ ప్రజలు, పలు పార్టీల నాయకులు, అభిమానులు ఘనంగా స్వాగతం పలికారు. ఆలయ పూజారులు మంచు విష్ణును ఆలయంలోకి ఆహ్వానించి ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా మంచు విష్ణు మాట్లాడుతూ ఏప్రిల్ 25న భక్తకన్నప్ప సినిమా రిలీజ్ అవుతుందని, భక్తకన్నప్ప చరిత్ర నేటితరానికి తెలియజేయాలనే ఉద్దేశ్యంతో ఈ సినిమాను తీశామని చెప్పారు. భక్తకన్నప్ప జన్మస్థలి ఊటుకూరులోని భక్తన్నప్ప ఆలయాన్ని తన వంతుగా అన్నివిధాలా అభివృద్ధి చేస్తామని తెలిపారు. గ్రామస్థులు, ఆలయ పెద్దలతో మాట్లాడి గుడికి కావాల్సిన సౌకర్యాలను ఏర్పాటు చేస్తానన్నారు. ఈ సందర్భంగా బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పోతుగుంట రమేష్‌నాయుడు, టీడీపీ సీనియర్ నాయకుడు, ఊటుకూరు గ్రామానికి చెందిన మలిశెట్టి సుబ్బరాయుడు తదితరులు ఆయనకు శాలువాలు కప్పి సత్కరించారు.



ఊటుకూరులో భక్తకన్నప్ప ఆలయం వద్ద మంచు విష్ణుకు స్వాగతం పలుకుతున్న గ్రామ ప్రజలు

పరీక్షల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు

- విద్యార్థులకు ఆర్టీసీ బస్సు సౌకర్యం
- కలెక్టర్ చామకూరి శ్రీధర్

రాయచోట (కలెక్టరేట్), మార్చి 15 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి పరీక్షల నిర్వహణకు పకడ్బందీగా ఏర్పాట్లు చేశామని కలెక్టర్ చామకూరి శ్రీధర్ తెలిపారు. శనివారం కలెక్టరేట్‌లో 10వ తరగతి పబ్లిక్ పరీక్షల నిర్వహణ ఏర్పాట్లపై కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఈనెల 17 నుంచి ఏప్రిల్ 1వ తేదీ వరకు పదో తరగతి, ఓపెన్ స్కూల్ పరీక్షలు జరుగుతాయని తెలిపారు. విద్య, పోలీసు, రెవెన్యూ శాఖల సమన్వయంతో ఏర్పాట్లను పూర్తి చేశామన్నారు. 121 పరీక్షా కేంద్రాల్లో మొత్తం 22,355 మంది విద్యార్థులు హాజరవుతారని, ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.45 వరకు పరీక్ష జరుగుతుందని తెలిపారు. పరీక్షా కేంద్రాల వద్దకు చేరుకోవడానికి వీలుగా ఏపీఎస్ఆర్టీసీ ద్వారా బస్సులను ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. అన్ని పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్‌ను ప్రకటించాలని సూచనలు జారీ చేశామన్నారు. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.45 వరకు పరీక్షా కేంద్రాల సమీపంలో జిరాక్స్ కేంద్రాలు మూసివేయాలని ఆదేశించారు. పరీక్ష రాసే విద్యార్థులకు డీహైడ్రేషన్ నివారణ కోసం ఓఆర్ఎస్ ప్యాకెట్లు సరఫరా చేయాలన్నారు. పరీక్షా కేంద్రాల్లో విద్యార్థులకు వడదెబ్బ నివారణకు అవసరమైన మందులను సరఫరా చేయాలని ఆదేశించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్, ఏఎస్పీ వెంకటాద్రి, డీఆర్వో మధుసూదన్‌రావ్, డీఈవో సుబ్రమణ్యం, మున్సిపల్ కమిషనర్ వాసు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ చామకూరి శ్రీధర్

ప్లాస్టిక్ రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు కృషి

- మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి

రాయచోటిటౌన్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా జిల్లాను ప్లాస్టిక్ రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి పిలుపునిచ్చారు. శనివారం పట్టణంలోని వీరభద్రస్వామి గుడి సమీపంలోని కూరగాయల మార్కెట్‌లో మంత్రితో పాటు కలెక్టర్ చామకూరి శ్రీధర్, జిల్లా ప్రత్యేక అధికారి వాడరేవు వినయ్‌చంద్, జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్‌లతో కలిసి మూడో శనివారం స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్రలో జిల్లాను రాష్ట్రంలోనే ముందంజలో ఉంచడంతో పాటు ప్లాస్టిక్ రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. రాయచోటి పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచాలని, జిల్లాలో ప్లాస్టిక్‌ను పూర్తిగా నిర్మూలించడానికి ప్రతి ఒక్కరూ సమన్వయంతో పని చేయాలన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములై జిల్లాను పరిశుభ్రంగా తీర్చిదిద్దాలన్నారు. ప్లాస్టిక్ వినియోగాన్ని పూర్తిగా నివారించి ప్లాస్టిక్ రహిత జిల్లాగా గుర్తింపు తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గాజుల ఖాదర్‌బాషా, అర్చన విద్యాసంస్థల అధినేత మదన్‌మోహన్‌రెడ్డి, పట్టణ మైనార్టీ కార్యదర్శి అతావుల్లా, మున్సిపల్ కమిషనర్ వాసుబాబు, టీడీపీ నాయకులు రాంబసిరెడ్డి, రషీద్, మహబూబ్‌అలీఖాన్ తదితరులు పాల్గొన్నారు.



కూరగాయల మార్కెట్‌ను పరిశీలిస్తున్న మంత్రి మండిపల్లి, కలెక్టర్ శ్రీధర్ తదితరులు

మోదీ పాలనలో దేశాభివృద్ధి శూన్యం

- జగన్‌కు భయపడి కూటమికి ఓట్లు వేశారు
- జగన్ అధికారంలోకి రావడం కలే
- కేంద్ర మాజీ మంత్రి, కాంగ్రెస్ నేత చింతామోహన్

మదనపల్లె అర్బన్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): మోదీ పాలనలో దేశాభివృద్ధి శూన్యమని కేంద్ర మాజీ మంత్రి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు చింతా మోహన్ అన్నారు. శనివారం మదనపల్లె పట్టణంలోని ప్రెస్‌క్లబ్‌లో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ కాంగ్రెస్ పాలనలో ఇందిరాగాంధీ సంస్కరణలు తీసుకువచ్చారని బ్యాంకులు జాతీయాకరణ చేశారని అన్నారు. మోదీ పాలనలో ఒక్క సంస్కరణ కూడా తీసుకురాలేదని ఎద్దేవా చేశారు. జగన్ పగటి కలలు మానుకోవాలని, తానే తిరిగి అధికారంలోకి వస్తామని చెప్పకోవడం మూర్ఖత్వం అవుతుందన్నారు. ప్రజలను జగన్ ఒక్క అవకాశం అడిగాడని, అది అయిపోయిందని ఇక జగన్ అధికారంలోకి రావడం అనేది కలే అన్నారు. కేంద్రంలో పెద్దలు కుల, మత, ప్రాంతీయ భేదాలు సృష్టించి విషబీజాలు నాటుతున్నారని జాగ్రత్త పడకపోతే ముప్పు తప్పదని అన్నారు. ఎస్సీ వర్గీకరణకు తాను వ్యతిరేకమని, ఇది పెద్దలు రెండు వర్గాలలో పెడుతున్న చిచ్చు అన్నారు. చంద్రబాబు చాలా జాగ్రత్తగా ఉండాలని, ఎస్సీ వర్గీకరణకు ఏకసభ్య కమిషన్ ఏర్పాటు చేయడం తగదన్నారు. సనాతన ధర్మం అంటే గంగానదిలో మునిగి, అయోధ్యలో రాముడికి దండం పెట్టడం కాదని పవన్ కళ్యాణ్‌ను ఉద్దేశించి వ్యంగాస్త్రాలు సంధించారు. అంటరానితనం నిర్మూలన, దళితుల ఆలయ ప్రవేశం, అందరికీ సమానత్వం కల్పించడం చేయాలన్నారు. ప్రజలు జగన్‌కు భయపడి కూటమి ప్రభుత్వానికి ఓట్లు వేశారే తప్ప పవన్ కళ్యాణ్ చెప్పుకొంటున్నట్లు వందశాతం స్ట్రైక్ రేటు కాదన్నారు. విలేకరుల సమావేశంలో మదనపల్లె పట్టణ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు రెడ్డి సాహెబ్ పాల్గొన్నారు.



మదనపల్లె ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడుతున్న కేంద్ర మాజీ మంత్రి చింతమోహన్

రంజాన్ వేళలు



	ఇఫ్తార్ (ఆదివారం సాయంత్రం)	సెహరీ (సోమవారం ఉదయం)
రాయచోటి	6.30	5.01
మదనపల్లె	6.31	5.08
రాజంపేట	6.28	5.09
పీలేరు	6.29	5.01

ప్లకార్డులతో దుకాణాల ముందు నిరసన

- మొండి బకాయిల వసూళ్లకు వినూత్న యత్నం
- దుకాణాల ముందు అధికారులు, కార్మికుల నిరసన
- పీలేరులో రూ.1.61 కోట్ల బకాయిలు

పీలేరు, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): పేరుకుపోయిన మొండి బకాయిల వసూలు కోసం పీలేరు గ్రామ పంచాయతీ అధికారులు, కార్మికులు వినూత్న ప్రయత్నం ప్రారంభించారు. తమకు బకాయి ఉన్న వారి దుకాణాల ముందు ప్లకార్డులు చేతబూని నిరసనకు దిగారు. పీలేరు అజంతా టాకీసు మిట్ట మీద ఉన్న స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా శాఖ ఉన్న భవన యజమాని రూ.8 లక్షల మేరకు పన్నుల బకాయి ఉండడంతో పీలేరు ఈవోపీఆర్ఆర్‌డీ లతీఫ్‌ఖాన్ నేతృత్వంలో పంచాయతీ అధికారులు, పారిశుధ్య సిబ్బంది శనివారం బ్యాంకు ముందు నిరసన చేపట్టారు. ప్లకార్డులు చేతబూని వారి బ్యాంకు ముందు నిరసనకు దిగారు. దీంతో బ్యాంకు అధికారులు సదరు భవన యజమానిని తక్షణమే పిలిపించి పంచాయతీ అధికారులతో మాట్లాడమని పురమాయించడంతో ఆయన పంచాయతీ అధికారులతో వాగ్వాదానికి దిగారు. అదే మార్గంలో మరో భవన యజమాని రూ.లక్ష బకాయి ఉండడంతో అక్కడ కూడా అధికారులు, కార్మికులు నిరసనకు దిగారు. నిరసనలకు కూడా లొంగకపోతే మరిన్ని కఠిన నిర్ణయాలు తీసుకుంటామని పీలేరు ఈవో గురుమోహన్ తెలిపారు. మరో వారం రోజులపాటు నిరసనలు చేపడతాం. అప్పటికీ లొంగకపోతే పంచాయతీరాజ్ నిబంధనల మేరకు ఆయా భవనాలకు నీరు, విద్యుత్ సరఫరా నిలిపివేయడం వంటి కఠిన చర్యలు తీసుకోవడానికి వెనుకాడం. అంతవరకు తెచ్చుకోకుండా యజమానులు స్వచ్ఛందంగా బకాయిలు చెల్లించేస్తే బాగుంటుందని ఈవో తెలిపారు.

రూ.1.61 కోట్ల పన్ను బకాయిలు

పీలేరు గ్రామ పంచాయతీకి ఇప్పటి వరకు రూ.1,61,40,091 పన్ను బకాయిలు ఉన్నట్లు అధికారిక లెక్కలు చెబుతున్నాయి. పీలేరు గ్రామ పంచాయతీకి 2024-25 ఆర్థిక సంవత్సరానికి రూ.1.96,08,493ల ఇంటి పన్నులు వసూలు కావాల్సి ఉండగా దానికి సమానంగా బకాయిలు ఉండడం విశేషం. ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, అధికారులు, కాసింత నోరు, కాసింత ఆర్థిక బలం వారు ఏళ్లకు ఏళ్లు పంచాయతీకి పన్నులు చెల్లించకపోవడంతో అది వందలు, వేలు దాటి లక్షలకు చేరుకుంది. పీలేరు మాజీ, ప్రస్తుత సర్పంచులు, వారి బంధువులు, ఓ ప్రముఖ విద్యాసంస్థ, ఎస్‌బీఐ ఉన్న భవనం, మండల ప్రజాపరిషత్ షాపింగ్ కాంప్లెక్స్ రూములు, నాలుగు రోడ్ల కూడలిలోని వాణిజ్య సముదాయం కలిపి రూ.20 లక్షల వరకు బకాయి ఉన్నట్లు పంచాయతీ సిబ్బంది తెలిపారు.



మొండి బకాయిదారుల దుకాణం ముందు నిరసన తెలియచేస్తున్న అధికారులు, కార్మికులు

పారిశుధ్యం.. ప్రజలందరి బాధ్యత

● జిల్లా ప్రత్యేక అధికారి వాడరేవు వినయ్‌చంద్

రాయచోటిటౌన్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): పారిశుధ్య నిర్వహణ బాధ్యత మున్సిపల్ కార్మికులు, పంచాయతీ కార్మికులది మాత్రమే కాదని, ఇది ప్రతి ఒక్కరి బాధ్యత అని జిల్లా ప్రత్యేక అధికారి వాడరేవు వినయ్‌చంద్ సూచించారు. శనివారం ఆయన పట్టణంలో స్వచ్ఛాం ధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమంలో పాల్గొన్నారు. ముందుగా పట్టణంలోని భద్ర కాళీ సమేత వీరభద్రస్వామిని దర్శించుకున్నారు. అర్చకులు పూర్ణ కుంభంతో స్వాగతం పలికారు. దర్శనం అనంతరం ఆలయ మండ పంలో అర్చకులు తీర్థప్రసాదాలు అందించి వేదాశీర్వచనం చేశారు. అనంతరం ఆయన డైట్ ఉన్నత పాఠశాలలో స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమంలో పాల్గొన్నారు. ఇప్పటి నుంచే విద్యార్థులు పరిశుభ్రతను అలవాటుగా చేసుకోవాలని ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం ఆర్టీసీ బస్సు కూడలి వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొన్నారు. ముఖ్య మంత్రి నారా చంద్రబాబు ప్రారంభించిన ఈ కార్యక్రమం అన్ని ప్రాంతాల్లోనూ ప్రతి నెల మూడవ శనివారం ఘనంగా నిర్వహిస్తున్నా మని, ఈ కార్యక్రమంలో అందరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. పారిశుధ్య నిర్వహణ బాధ్యత మున్సిపల్ కార్మికులు, పంచాయతీ కార్మికులది మాత్రమే కాదని, ఇది ప్రతి ఒక్కరి బాధ్యత అని ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్, మున్సిపల్ కమిషనర్ వాసుబాబు, ఆలయ ఈవో విశ్వ నాథ్, మున్సిపల్ అధికారులు, జిల్లా అధికారులు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.


విద్యార్థులు, ఉపాధ్యాయులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న జిల్లా ప్రత్యేక అధికారి వినయ్‌చంద్

మిద్దెపై నుంచి కింద పడి ఒకరి మృతి

రామాపురం, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): మద్యం మత్తులో మిద్దెపై నుంచి పడి ఓ వ్యక్తి మృతి చెందాడు. ఎస్ఐ వెంకట సుధాకర్‌రెడ్డి కథనం మేరకు ఉత్తరప్రదే శ్‌లోని వారణాసికి చెందిన రాజేశ్ యాదవ్(40) మండలంలోని కసిరెడ్డిగా రిపల్లె పంచాయతీ కొత్త రోడ్డు నారాయణపురం సమీపంలోని వినా యక స్టోన్ క్రషర్‌లో పనిచేస్తూ, కొత్తరోడ్డు నారాయణపురంలో నివాస ముంటున్నాడు. హోలీ సందర్భంగా శుక్రవారం రాత్రి తన సహచరు లతో కలిసి అతిగా మద్యం సేవించి, మిద్దెపై నిద్రించాడు. అర్ధరాత్రి సమయంలో మిద్దెపై నుంచి పడి మృతి చెందాడు. రామాపురం పోలీ సులు. సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని రాయచోటి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.


రాజేశ్‌యాదవ్ మృతదేహం

పాతకక్షలతో మహిళపై దాడి

గుర్రంకొండ, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): పాతకక్షల కారణంగా దాడి చేసి గాయపరిచారంటూ ఓ మహిళ శనివారం పోలీ సులకు ఫిర్యాదు చేసింది. సరిమడుగు పంచాయతీ కృష్ణాపురానికి చెందిన వాసాల రఘు, గంగరాణి దంపతులకు అదే గ్రామా నికి చెందిన మల్లేశ్వరి కుటుంబానికి పాత కక్ష లున్నాయి. ఈ నేప థ్యంలో శనివారం మల్లే శ్వరి, ఆమె కుమారుడు సంతోష్ మరో పది మంది యువకులతో ఇంట్లోకి దూరి తనపై దాడి చేయడంతోపాటు ఇంట్లో ఉన్న టీవీ, ఫ్యాన్, బ్యాటరీ పంప్‌ను ధ్వంసం చేసి. చంపేస్తామంటూ బెదిరించినట్లు గంగరాణి ఫిర్యాదులో పేర్కొన్నారు.


గంగరాణి ఇంటిలో ధ్వంసమైన టీవీ, ఫ్యాన్ తదితరాలు

పేకాట రాయుళ్ల అరెస్ట్.. నగదు స్వాధీనం

నిమ్మనపల్లి, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): పేకాట ఆ డుతున్న నలుగురిని అదుపులోకి తీసు కుని, నగదును స్వాధీనం చేసు కున్నట్లు ఎస్ ఐ తిప్పేస్వామి తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ మండలంలోని సామకోటవారిపల్లి పంచాయతీ లోని ఓ చింతచెట్టు కింద అదే గ్రామానికి చెందిన నలుగురు పేకాట ఆడుతుండగా దాడులు నిర్వహించి రూ.3420 స్వాధీనం చేసు కొని కేసు నమోదు చేసినట్లు తెలిపారు.


పోలీసులకు పట్టుబడ్డ పేకాట రాయుళ్లు

ఆత్మహత్య కేసులో ముగ్గురు అరెస్టు

మదనపల్లె అర్బన్, మార్చి 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని సిద్దమ్మగా రిపల్లెకు చెందిన గిరిబాబు గత నెల 20న ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న విషయం తెలిసిందే. మృతుని తల్లి ఫిర్యాదు మేరకు ఈ కేసులో నిందితులుగా భావిస్తున్న అదే గ్రామానికి చెందిన అనిల్, శివ, అరుణను శనివారం దేవతా నగర్ సమీపంలో శనివారం సాయంత్రం అదుపులోకి తీసుకుని, రిమాండ్‌కు తరలించినట్లు తాలుకా సీఐ కళా వెంకటరమణ తెలిపారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురికి గాయాలు

మదనపల్లె అర్బన్, మార్చి 15(ఆంధ్రజ్యోతి):వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురు గాయపడి శనివారం మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి వచ్చారు. కురబలకోట మండలం గొర్లవారిపల్లెకు చెందిన నాగమల్‌రెడ్డి (55), ఆదినారాయణ బైక్‌పై సీటీఎంకు వస్తుండగా మిట్టపల్లె వద్ద ఆటో ఢీ కొంది ఈ సంఘటనలో ఇద్దరూ గాయపడ్డారు. మదనప ల్లెలో టైలర్ షాపు నిర్వహిస్తున్న మధుకర్‌రెడ్డి (40) మధ్యాహ్నం ఇసు కనూతినపల్లె దారిలో వెళుతూ ఎదురుగా వస్తున్న బైక్‌ను ఢీకొన్నాడు. దీంతో గాయపడిన అతనిని మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తర లించారు.

ఆదర్శ ఉద్యోగులకు నగదు ప్రోత్సాహకాలు

మదనపల్లె అర్బన్, మార్చి 15(ఆంధ్రజ్యోతి):మదనపల్లె ఆర్టీసీ వన్ డిపోలో శనివారం ఆదర్శ ఉద్యోగుల అభినందన సభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆ డిపో మేనేజరు మూరే వెంకటరమణారెడ్డి మాట్లాడుతూ డిపో పరిధిలో అత్యధికంగా కేఎంపీఎల్, ఈపీకే, అధి కంగా ఆదాయం తెచ్చిన ఉద్యోగులకు నగదు బహుమతులను అందజే శారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజరు రేవతి, రవి, తదిత రులు పాల్గొన్నారు.


కల్యాణం నిర్వహిస్తున్న వేద పండితులు


శ్రీవారికి పట్టువస్త్రాలు తీసుకెళుతున్న సీఎం చంద్రబాబు దంపతులు




పట్టువస్త్రాలు సమర్పిస్తున్న చంద్రబాబు దంపతులు, బీఆర్ నాయుడు

అమరావతిలో.. శ్రీవారి కల్యాణోత్సవం

రాజధాని అమరావతి వెంకటపాలెంలోని శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో ప్రప్రథమంగా శనివారం శ్రీవారి కల్యాణోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో వేదమంత్రోచ్ఛరణల మధ్య అఖిలాండ కోటి బ్రహ్మాండనాయకుడి కల్యాణాన్ని తిలకించిన భక్తజన సందోహం పరవశించింది. విద్యుత్ వెలుగులతో కల్యాణ ప్రాంగణం కాంతులీనగా భక్తుల జయజయధ్వానాల మధ్య కన్నుల పండువగా జరిగింది. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు దంపతులు, గవర్నర్ అబ్దుల్ నజీర్ తదితరుల సమక్షంలో టీటీడీ వేద పండితులు స్వామివారి కల్యాణాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. భక్తులను భాగస్వాములను చేస్తూ కైంకర్యాలను నిర్వహించారు.

-తుళ్లూరు, ఆంధ్రజ్యోతి


గవర్నర్ అబ్దుల్ నజీర్‌కు లడ్డూ ప్రసాదం అందజేస్తున్న టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు


చంద్రబాబుకు లడ్డూ ప్రసాదం అందజేస్తున్న బీఆర్ నాయుడు


వెంకటపాలెంలోని వేంకటేశ్వరస్వామి కల్యాణ మహోత్సవంలో పాల్గొన్న గవర్నర్ అబ్దుల్‌నజీర్, సీఎం చంద్రబాబు దంపతులు, మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు తదితరులు


సీఎం చంద్రబాబుకు వేంకటేశ్వరస్వామి జ్ఞాపికను అందజేస్తున్న టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు, ఈవో శ్యామలరావు

టీడీపీ నేత హత్య దారుణం

● పోలీసుల నిర్లక్ష్యమే కారణం ● ఎమ్మెల్యే అమరనాథరెడ్డి

మదనపల్లె అర్బన్, మార్చి 15(ఆంధ్రజ్యోతి): పుంగనూరు మండలం, చంద్రమాకులపల్లె గ్రామం కృష్ణాపురానికి చెందిన టీడీపీ నేత రామకృష్ణ హత్య చాలా దారుణమని మాజీ మంత్రి, పలమనేరు ఎమ్మెల్యే అమరనాథరెడ్డి అన్నారు. పోలీసుల నిర్లక్ష్యం వల్లే ఈ హత్య జరిగిందన్నారు.

చిత్తూరు జిల్లా పుంగనూరు మండలం కృష్ణాపురంలో శని వారం ఉదయం చిల్లర అంగడి వద్ద కె.రామకృష్ణ కుమారుడు సురేశ్‌కుమార్ కూర్చుని ఉండగా.. అక్కడికి మాజీ వలంటీర్, వైసీపీ కార్యకర్త కె.వెంకటరమణ బైక్‌పై వచ్చి సంచిలో తెచ్చు కున్న కొడవలితో హత్య చేయడానికి ప్రయత్నించాడు. ఈ సంఘటనలో సురేశ్‌కుమార్ చేతికి గాయమైంది. అతను కేకలు వేస్తూ పరుగులు తీస్తుండగా అటుగా వెళుతున్న ద్విచక్రవాహ నదారులు కాపాడారు. కొడుకును తరుముతున్నట్లు తెలుసు కున్న సురేశ్‌కుమార్ తండ్రి రామకృష్ణ పొలం దగ్గర నుంచి రాగా అతనిపై వెంకటరమణ కొడవలితో దాడిచేసి పారిపో యాడు. క్షతగాత్రులను వెంటనే మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఇక్కడ డాక్టర్లు సురేశ్‌కుమార్‌కు చికిత్స చేశారు. రామకృష్ణను మెరుగైన వైద్యం కోసం తిరుపతికి తరలిస్తుండగా మృతిచెందాడు. మృతదేహాన్ని మదనపల్లె మార్చురీలో ఉంచారు.

మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో ఉన్న రామకృష్ణ మృత దేహాన్ని అమరనాథరెడ్డి సందర్శించి వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కక్షపూ రిత రాజకీయాల్లో భాగంగానే కృష్ణాపురం గ్రామానికి చెందిన వైసీపీ నాయకుడు వెంకటరమణ కొడవలితో దాడి చేసి రామ కృష్ణ, అతని కుమారుడు సురేశ్‌ను గాయపర్చాడన్నారు. పోలీ సుల నిర్లక్ష్యంతో ఈ రోజు నిండుప్రాణం పోయిందన్నారు. పోలీసు శాఖను ప్రభుత్వం ప్రక్షాళన చేయాలన్నారు. ఈయన వెంట పుంగనూరు ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డి, మాజీ ఎమ్మెల్యే దొమ్మలపాటి రమేశ్ ఉన్నారు. సాయంత్రం పూతల పట్టు ఎమ్మెల్యే మురళి మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి విచ్చేసి రామకృష్ణ మృతదేహాన్ని సందర్శించారు. కాగా.. మదన పల్లె జిల్లా ఆస్పత్రిలో రామకృష్ణ మృతదేహాన్ని తెలుగు యువత రాష్ట్ర అధ్యక్షుడు శ్రీరాం చినబాబు, దొరస్వామినా యుడు సందర్శించారు. మృతుడి భార్య ఉమాదేవిని, కుమా రులు సురేష్‌కుమార్, శివ కుటుంబసభ్యులను వారు పరామ ర్శించారు. హోం మంత్రితో బాధిత కుటుంబీకులను ఫోన్లో మాట్లాడించారు.

న్యాయం చేస్తామన్న హోంమంత్రి

గాయపడిన సురేశ్‌కుమార్ హోంమంత్రితో ఫోన్‌లో మాట్లా డుతూ గ్రామంలో మొదట వైసీపీని ఎదిరించి టీడీపీ జెండా కట్టింది మా నాన్న అని, గతంలో టీడీపీ గెలిచిన సందర్భంగా కేక్‌కట్ చేస్తుంటే బైక్‌పై వచ్చి మా అమ్మ రెండు కాళ్లు విరగగొ ట్టారని వివరించారు. తరువాత చంద్రబాబు నాయుడు బర్త్‌డే కార్యక్రమం చేస్తుంటే తన అన్న శివ చెయ్యి విరగ్గొట్టారని, ఇప్పుడు ఏకంగా కొడవలితో దాడి చేసి తన చేతికి గాయం చేశాడని, అడ్డు వచ్చిన మానాన్నను నరికి చంపేశాడని తెలిపారు. గతంలో జరిగిన సంఘటనలపై పుంగనూరు స్టేష న్‌లో కేసులు ఉన్నాయని, ఏ కేసులో కూడా తమకు న్యాయం జరగలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పుడైనా న్యాయం చేయాలని వేడుకున్నారు. పార్టీ కోసం పాటుపడుతున్న వారికి న్యాయం చేయలేకపోతే సామాన్య ప్రజల పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. హోం మంత్రి వారిని పరామర్శించి న్యాయం చేస్తామని భరోసా ఇచ్చారు. ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందన్నారు.


మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో మీడియాతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అమరనాథ్‌రెడ్డి


రామకృష్ణ మృతదేహాన్ని పరిశీలిస్తున్న తెలుగు యువత రాష్ట్ర అధ్యక్షుడు శ్రీరాం చినబాబు

ఊట చెరువు టీసీ సభ్యుల సస్పెన్షన్

సుండుపల్లె, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తిమ్మసముద్రం గ్రామంలో గతంలో జరిగిన ఊట చెరువు ఎన్నికపై వి చారణకు కలెక్టర్ చామకూరి శ్రీధర్ కమి టీని నియమించిన సంగతి తెలిసిందే. సదరు ఘటనపై పూర్తి విచారణ చేసిన కమిటీ నా లుగు, ఐదో నంబర్ టీసీ ఎన్నికల్లో అక్ర మాలు జరిగినట్లు నిర్ధారించింది. దీంతో ఆ యా టీసీల బాధ్యులు అబ్దుల్ తవాబ్, ఖలీ లుల్లాలను సస్పెండ్ చేస్తూ శనివారం కలె క్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. హైకోర్టు ఉత్తర్వు ప్రకారం ఊట చెరువు అధ్యక్షుడిగా ఎన్నికైన లగిశెట్టి రామాంజులు టీసీ మూ డుగా కొనసాగుతారని ఉత్తర్వుల్లో తెలియ జేశారు. అప్రజాస్వామికంగా ఎన్నికైన టీసీ సభ్యులను సస్పెండ్ చేసినందుకు ఫిర్యాదు దారు టీసీ-2 సభ్యుడు మోహన్‌నాయుడు కలెక్టర్‌కు ధన్యవాదాలు తెలిపారు. ఈ చర్య తోకూటమి ప్రభుత్వంలో అక్రమాలకు చోటు ఉండదు అని నిరూపితమైందని, ఈ విష యంపై స్పందించిన ముఖ్యమంత్రి చంద్రబా బునాయుడు నారా లోకేశ్, ఇరిగేషన్‌శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు ఇరిగేషన్ కమిషనర్ అన్నమయ్య జిల్లా కలెక్టర్, జిల్లా ఇరిగేషన్‌శాఖ అధికారులు ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు తెలిపారు.

మల్లూరమ్మ ఆలయ హుండీ లెక్కింపు

చిన్నమండెం, మార్చి15(ఆంధ్రజ్యోతి): మం డలంలోని కొత్తపల్లి పంచాయతీలో గురు, శుక్రవారాల్లో నిర్వహించిన మల్లూరమ్మ జాతర సందర్భంగా భక్తులు హుండీలో సమర్పించిన కానుకలను శనివారం లెక్కిం చారు. దేవదాయశాఖ, పోలీసు, రెవెన్యూ సిబ్బందితోపాటు ఆలయ కమిటీ సభ్యులు ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సం దర్భంగా దాదాపు 2,93,890 రూపాయలు ఆదాయం వచ్చిందని ఈవో కొండారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు.


హుండీలోని కానుకలు లెక్కిస్తున్న అధికారులు, సిబ్బంది

పేదవాడి హలీం.. గంజి!

» రమజాన్ మాసం ప్రత్యేకం

» ప్రతి మసీదులోనూ ఉచితంగా పంపిణీ..

పీలేరు, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): ఇస్లాంలో రమజాన్ ప్రత్యేక మైనది. ఈ నెలలో చేసే ప్రార్థనలు, నమాజులు, దానధర్మాలకు ఎంతో ప్రత్యేకత ఉంటుంది. ధార్మికమైన అంశాలలోనే కాకుండా ఆహార అలవాట్లలో కూడా రమజాన్ మాసం ప్రత్యేకత చాటుకుంటుది. రోజంతా కఠోర ఉపవాసం ఉండే ముస్లింలు సాయంత్రం ఇఫ్తార్ సమయంలో బలవర్ధకమైన భోజనం కావాలని కోరుకుంటారు. ఖర్జూరంతోపాటు, పలు రకాల ఫలాలు తీసుకుంటూ ఉంటారు. వీటితోపాటు తెలం గాణ ప్రాంతంలో హలీమ్, కోసాంధ్ర ప్రాంతంలో గంజి ఎక్కువగా స్వీకరిస్తారు. హలీమ్ మాంసాహారం కావడంతో దాని తయారీం, వినియోగం అందరికీ సాధ్యపడదు. ఇక గంజి .. తక్కువ ఖర్చుతో, సులువుగా తయారు చేసుకునే అవకాశం ఉండడంతో, అందరూ దీని వైపు మళ్లుతున్నారు. రెండు దశాబ్దాల క్రితం గృహస్థులు గంజిని తయారు చేసి మసీదుకు వితరణ చేసేవారు. కాలక్రమంలో మసీదు కమిటీ సభ్యులే దానిని తయారు చేసి తమ మసీదు పరిధిలోని వారికి ఉచితంగా పంపిణీ చేస్తున్నారు.

తయారీ ఇలా..

బియ్యం రవ్వ లేదా, బొంబాయి రవ్వతో గంజిని తయారు చేస్తున్నారు. పీలేరు ప్రాంతంలోని అత్యధిక మసీదుల్లో బొంబాయి రవ్వతో తయారు చేసిన గంజిని పంపిణీ చేస్తు న్నారు. బొంబాయి రవ్వ, పచ్చిమిర్చి, అల్లం, వెల్లుల్లి, టమో టాలు, కొత్తిమీర, పుదీనా, యాలకులు, దాల్చిన చెక్క, లవం గాలు, నెయ్యి, కొన్ని చోట్ల వేరుశెనగ గింజలను వాడుతుం టారు. రమజాన్ మాసం ప్రారంభమైన నాటి నుంచి మసీదు కమిటీ సభ్యులు గంజి తయారీకి ఎటువంటి ఆటంకం కలుగ కుండా చర్యలు తీసుకుంటున్నారు. ఇలా తయారు చేసిన గంజిని కుల, మతాలకు అతీతంగా ఇష్టపడుతుంటారు. క్యూలో నిలబడి మరీ ఇళ్లకు తీసుకెళుతుంటారు.


గంజి పంపిణీ చేస్తున్న మసీదు కమిటీ సభ్యులు

రమజాన్ మాసంలో అతి ముఖ్యమైన ఆరాధన ఉప వాసం. రాయలసీమ, కోస్తాంధ్ర ప్రాంతాల్లో గంజిని ఆహారంగా తీసుకుని ఉపవాసం విరమిస్తుంటారు. చాలా ప్రాంతాల్లో ఇఫ్తార్ సమయంలో పండ్లు, అల్పా హారం లేకపోయినా చిన్నా, పెద్ద తేడా లేకుండా అందరూ ఒక గిన్నె గంజి తప్పకుండా తాగుతారు.

ఆరోగ్య ప్రయోజనాలు

- ఉపవాసం కారణంగా సుమారు 14 గంటలు ఆహారానికి దూరంగా ఉన్న శరీరానికి తక్షణ శక్తి లభిస్తుంది.
- వేడెక్కిన శరీరాన్ని చల్లబరుస్తుంది.
- గంజిలో విటమిన్లు, ఖనిజాలు, యాంటి ఆక్సిడెంట్లు ఉంటాయి. ఇవి శరీరానికి అవసరమైన పోషకాలు అందిస్తాయి.
- ఫైబర్ అధికంగా ఉన్న కారణంగా జీర్ణక్రియ మెరుగుపడుతుంది.
- కేలరీలు తక్కువగా ఉంటాయి కాబట్టి బరువు తగ్గించడంలో సహాయపడుతుంది.
- కార్బోహైడ్రేట్లు అధికంగా ఉండడం వల్ల రక్తంలో చక్కెర స్థాయిలను క్రమంగా పెంచుతుంది.


పీలేరు అక్సా మసీదులో గంజి తయారీ కోసం కూరగాయలు కోస్తున్న కమిటీ సభ్యులు

ఏప్రిల్‌లో రెండో దశ పశువైద్య శిబిరాలు

● పశుసంవర్ధక శాఖ జేడీ గుణశేఖర్ పిళ్లై

తంబళ్లపల్లె, మార్చి 15(ఆంధ్రజ్యోతి): వేస విలో పశువులు జబ్బుల బారిన పడకుండా గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయిం చాలని జిల్లా పశుసంవర్ధక శాఖ సంయు క్త సంచాలకుడు గుణశేఖర్ పిళ్లై సూచించారు. శనివారం స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ దివస్ కా ర్యక్ర మం సందర్భంగా మండ లా నికి వచ్చిన ఆయన స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. జాతీయ పశువ్యాధి నివారణ పథకం కింద మార్చి 31 వరకు జిల్లా వ్యాప్తంగా సుమారు 3,33,300 గాలి కుంటు టీకా లను వేయనున్నట్లు తెలిపా రు. ప్రతి మండలంలో పశు వైద్య సిబ్బంది బృందాలుగా ఏర్పడి ఉద యమే ఇంటింటికీ వెళ్లి మూడు నెలలు వయసు పైబడ్డ పశువులన్నింటికీ ఉచితం గా టీకాలు వేస్తారన్నారు. గాలికుంటు టీ కా పంపిణీలో రాష్ట్రంలో అన్నమ య్య జిల్లా ద్వితీయ స్థానంలో ఉన్నట్లు వివరిం చారు. పెయ్యదూడలకు బ్రుసెల్లోసిస్ టీకా లు వేస్తున్నట్లు తెలిపారు. ఈ టీకాలు జిల్లాకు 15,000 డోసులు వచ్చాయని.. 4 నుంచి 8 మాసాలలోపు పెయ్య దూడలకు వీటిని వేయనున్నట్లు తెలిపారు. ఇప్పటి దాకా జిల్లాలో 10వేల టీకాలను వేశామని, ఈ నెల చివరకు మిగిలిన టీకాలు పూర్తి చేస్తామని తెలిపారు. వేసవిలో పశుగ్రాస కొరతను అధిగమించేందుకు గత 2024-25లో నీటి ఎద్దడి తట్టుకుని అధిక గ్రాసాన్నిచ్చే 175 టన్నుల గడ్డి విత్తనాలను 75 శాతం రాయి తీతో పంపిణీ చేసినట్లు తెలి పారు. సాగు నీటి సౌకర్యం ఉన్న రైతులు ఈ విత్తనాలు పొంది పశుగ్రాసాన్ని నిల్వ చేసుకున్నట్లు వివరించారు. ఉపాధి హామీ పథకం ద్వారా ఒక్కో రైతు 10 సెంట్ల నుంచి 50 సెంట్లలో బహువార్షిక గడ్డి పెంపకానికి వంద శాతం రాయితీ ఇస్తున్నట్లు తెలి పారు. తంబళ్లపల్లె నియోజకవర్గంలో దా దాపు 500 ఎకరాలలో గడ్డి సాగుకు ప్రోత్స హించినట్లు తెలిపారు. జనవరిలో నిర్వహిం చిన పశువైద్య శిబిరాలలో కొన్ని లక్షల పశు వులకు వ్యాధి నివారణ టీకాలు వేసినట్లు తెలిపారు. ఈ శిబిరాలకు పాడి రైతుల నుంచి విశేష స్పందన రావడంతో ఏప్రిల్‌లో రెండో విడత నిర్వహించేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నామన్నారు. ఎంపీడీవో ఉపేం ద్రారెడ్డి, ఎంఈవో త్యాగరాజు తదితరులు ఉన్నారు.


మాట్లాడుతున్న జేడీఏహెచ్ గుణశేఖర్ పిళ్లై

పశువైద్య సేవలకు ఆటంకం

● జిల్లాలో నిలిచిన సంచార వాహనాలు ● పాడి రైతుల అవస్థలు ● రోడ్డున పడ్డ సిబ్బంది



నిలిచిన సంచార పశుఆరోగ్య సేవా వాహనం

ప్రొద్దుటూరు రూరల్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): పశువులకు అత్యవసర వైద్యసేవలు అందించేందుకు గత ప్రభుత్వం సంచార పశు ఆరోగ్య సేవా వాహనాలను అందుబాటులోకి తెచ్చింది. పశువులకు ప్రమాదాలు జరిగినప్పుడు, రోగాల బారిన పడినప్పుడు దూర ప్రాంతాల్లోని వైద్యశాలలకు తీసుకెళ్లాలంటే పోషకులు వ్యయప్రయాసలు పడేవారు. ఒక్కోసారి లక్షలు విలువచేసే పశువులు మృత్యువాత పడుతుండటంతో రైతులు ఆర్థికంగా నష్టపోతున్నారు. ఈ నేపథ్యంలో మూగజీవాల మరణాల రేటును తగ్గించేందుకు సంచార వాహనాలను ఏర్పాటు చేశారు. 2022 మే నెలలో తొలివిడత ప్రతి నియోజకవర్గానికి ఒకటి చొప్పున జిల్లాకు ఏడు వాహనాలు కేటాయించారు. ప్రస్తుతం జీవీకే సంస్థతో ఒప్పందం ముగిసిపోవడంతో వాటి సేవలు తాత్కాలికంగా నిలిచిపోయాయి. మొదటి విడతలో ప్రొద్దుటూరు, జమ్మలమడుగు, కమలాపురం, మైదుకూరు, కడప, బద్వేలు, పులివెందుల నియోజకవర్గ ప్రాంతాల్లో వాహనాలు ఎక్కడికక్కడే ఆగిపోయాయి. దీంతో గ్రామాల్లోని పశుపోషకులు జీవాలకు ఏవైనా వ్యాధులు సోకితే చికిత్సలు చేయించేందుకు ఇబ్బందులు పడుతున్నారు.

పాడి రైతుల అవస్థలు

20వ పశుగణన సర్వే ప్రకారం జిల్లాలో గేదెలు 3,99,754, ఎద్దులు, ఆవులు 44 వేలు, గొర్రెలు 9,20,614, మేకలు 3,80,099 ఉండగా.. జిల్లాలో 1.80 లక్షల మంది ప్రత్యక్ష పాడి రైతులు ఉన్నారు. ఈ నేపథ్యంలో పశువుల సంరక్షణ కోసం 20 రకాల మల సంబంధిత పరీక్షలు, 15 రకాల రక్త పరీక్షలు చేసే వీలుగా మైక్రోస్కోప్‌తోపాటు ఆటోగ్లేవ్ ప్రయోగశాలను సంచార వాహనంలో ఏర్పాటు చేశారు. హైడ్రాలిక్ సౌకర్యంతో పశువులను వెంటనే వాహనంలోకి ఎక్కించి చికిత్స అందించేందుకు వీలుండేది. ఇంకా అత్యవసర పరిస్థితి అయితే అందులోనే వైద్యశాలకు తరలించి చికిత్స అందించేవారు. వాహనంలో పశువైద్యుడితోపాటు పారావేట్, డ్రైవర్‌కం అటెండర్ ఉండేవారు. ఆవులు, గేదెలు, గొర్రెలు, మేకలు తీవ్ర అనారోగ్యానికి గురైనప్పుడు అత్యవసర వైద్యసేవలు అందించేందుకు పశుపోషకులు టోల్‌ఫ్రీ నెంబరు 1962కు ఫోన్‌చేస్తే ఆయా గ్రామాలకు వెళ్లి వైద్యసేవలు అందించే వారు. అత్యవసర వైద్యం చేయాల్సివస్తే వైద్య నిపుణులు స్థానిక సిబ్బందితో కలిసి వాహనంతో ఘటనా స్థలానికి చేరుకుని శస్త్ర చికిత్సలు చేసేవారు. వాహనాలు ఆగిపోవడంతో పశువులకు ఏవైనా అత్యవసర వైద్యం చేయాల్సి వస్తే ఇబ్బందిగా మారిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

గడువు ముగియడంతో నిలిచిపోయాయి..

తొలి విడత వాహనాలు ఒప్పందం ముగియడంతో జిల్లాలోని ఏడు నియోజకవర్గాల్లో వాహనాలు నిలిచిపోయాయి. రెండవ విడత వచ్చిన వాహనాలతో వైద్య సేవలు అందిస్తున్నాం. పశు వైద్య సేవలకు ఆటంకం లేకుండా చూస్తున్నాం.

\- సి.శారదమ్మ, పశుసంవర్ధకశాఖ జేడీ

ఫిబ్రవరి 15 నుంచి..

జీవీకే సంస్థతో ఒప్పందం ముగియడంతో మొదటి విడతలో జిల్లాకు కేటాయించిన వాహనాలు ఫిబ్రవరి 15 నుంచి ఆగిపోయాయి. ఇందులో పనిచేసే సిబ్బంది ఉద్యోగాలు కోల్పోయి రోడ్డున పడ్డారు. వీరంతా తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని పశుసంవర్ధకశాఖ జాయింట్ డైరెక్టర్ శారదమ్మను కలిసి సిబ్బంది వినతి పత్రం అందించారు. ప్రభుత్వం ఏ సంస్థతో ఒప్పందం కుదుర్చుకున్నా తమను తిరిగి విధుల్లో కొనసాగించాలని కోరుతున్నారు.



పశుసంవర్ధకశాఖ జేడీ శారదమ్మకు వినతి పత్రం అందిస్తున్న సంచార వాహన సిబ్బంది

విద్యార్థిని ఆత్మహత్య కారకులపై కేసు నమోదు చేయాలి

● ప్రజా సంఘాలు, విద్యార్థి సంఘాల నాయకుల డిమాండ్



డీడీ సరస్వతికి వినతిపత్రం అందిస్తున్న టీడీపీ ఇన్‌చార్జి భూపేశ్‌రెడ్డి, విద్యార్థి సంఘాల నేతలు

జమ్మలమడుగు, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ వసతి గృహ విద్యార్థిని అక్షయ ఆత్మహత్యకు కారకులైనవారిపై కేసు నమోదు చేయాలని ప్రజాసంఘాలు, విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. శనివారం జమ్మలమడుగు ప్రభుత్వ ఆస్పత్రి మార్చురీ వద్ద విద్యార్థిని మృతదేహాన్ని సోషియల్ వెల్ఫేర్ జిల్లా డిప్యూటీ డైరెక్టర్ సరస్వతి సందర్శించారు. అలాగే టీడీపీ ఇన్‌చార్జి భూపేశ్‌రెడ్డి, జనసేన నాయకుడు సింగరెడ్డి నాగేశ్వరరెడ్డితో పాటు సీపీఐ ప్రసాద్, డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి శివకుమార్, శిరివెళ్ల లక్ష్మీనారాయణ, సీపీఎం శివనారాయణ, ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి బత్తల పీటర్, అరవింద్, టీఎన్ఎస్ఎఫ్, బీసీ సంక్షేమ సంఘం నాయకుడు బొర్రా రామాంజనేయులు, బీజేపీ కొండయ్య, చేనేత ఐక్యవేదిక జాతీయ ఉపాధ్యక్షులు కాటా రామరాసు, సురేష్, నాయీ బ్రాహ్మణ సంక్షేమ సంఘం నాయకులు మృతదేహాన్ని సందర్శించి మృతురాలి తల్లి పద్మావతితో మాట్లాడారు. తల్లికి పింఛన్‌తో పాటు ఆమె కుమారుడికి ఉద్యోగం, ప్రభుత్వపరంగా ఆర్థికసాయం అందేలా చేస్తామని భూపేశ్‌రెడ్డి హామీ ఇచ్చారు. అనంతరం నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని డీడీ సరస్వతికి వినతి పత్రం అందించారు. విద్యార్థిని ఆత్మహత్యకు కారకులైనవారిపై విచారణ జరిపిస్తున్నామని, ముందుగా వార్డెన్ బత్తల ప్రభావతిని సస్పెండ్ చేశామని, అలాగే మరో ఇద్దరు సిబ్బందిని విధుల నుంచి పూర్తిగా తొలగించేందుకు ఉన్నతాధికారులకు నివేదిక పంపామని డీడీ సరస్వతి తెలిపారు. ఏఎస్‌డబ్ల్యూవో గురుప్రసాద్‌పై క్రమశిక్షణ చర్యలతో పాటు అతని నిర్లక్ష్యానికి సంబంధించిన నివేదికను ఉన్నతాధికారులకు పంపుతున్నట్లు తెలిపారు. ఆ వసతి గృహంలో అనేక ఆరోపణలు ఉన్నాయని, ఇంకా విచారణ జరుగుతోందన్నారు. వసతి గృహాల్లో ఇలాంటివి పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.



శిలాఫలకం ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ భూమిరెడ్డి రామగోపాల్‌రెడ్డి

బస్‌షెల్టర్‌ను సద్వినియోగం చేసుకోవాలి

● ఎమ్మెల్సీ భూమిరెడ్డి రామగోపాల్‌రెడ్డి

పులివెందుల టౌన్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): చికిత్స కోసం ఆసుపత్రికి వచ్చే ప్రజలు, రోగులు బస్‌షెల్టర్లను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్సీ భూమిరెడ్డి రామగోపాల్‌రెడ్డి అన్నారు. శనివారం కడపరోడ్డులోని సర్వజన ఆసుపత్రి వద్ద నూతనంగా నిర్మించిన బస్సుషెల్టరును ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ నియోజకవర్గంలో ఎక్కడా సాగు, తాగునీటి సమస్య లేకుండా చర్యలు తీసుకుంటామన్నారు. చక్రాయపేట మండలంలో తీవ్ర తాగునీటి ఎద్దడి ఉందని కలెక్టరు దృష్టికి తీసుకెళ్లడంతో ప్రస్తుతానికి బోర్లు వేయడం జరిగిందని, ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి మరిన్ని నిధులు మంజూరు చేయించడానికి కృషి చేస్తానన్నారు. నియోజకవర్గ ప్రజలు జగన్‌మోహన్‌రెడ్డిని 60వేల మెజార్టీతో గెలిపిస్తే సమస్యలను గాలికి వదిలేశారన్నారు. కార్యక్రమంలో పులివెందుల ఆర్‌అండ్‌బీ ఈఈ మాధవి, డీఈ జగదీశ్వర్‌రెడ్డి, మోపూరి దేవాలయం చైర్మన్ వెంకటరమణారెడ్డి, తొండూరు మాజీ మండల అధ్యక్షుడు ఎం.రమణారెడ్డి, కడప పార్లమెంటు కార్యదర్శి బొజ్జ మైసూరారెడ్డి, బీజేపీ నాయకుడు భానుప్రకాశ్, ఆర్‌అండ్‌బీ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

వివాదరహితంగా పాఠశాలల విలీన ప్రక్రియ

● ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డి

పులివెందుల టౌన్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): వివాదరహితంగా పాఠశాలల విలీన ప్రక్రియ చేపడతామని పశ్చిమ రాయలసీమ జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ భూమిరెడ్డి రామగోపాల్‌రెడ్డి అన్నారు. పులివెందుల ఆర్‌అండ్‌బీ అతిథిగృహంలో శనివారం జిల్లా విద్యాశాఖాధికారి ఆధ్వర్యంలో ఏడు మండలాల విద్యాశాఖాధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ విద్యార్థులకు అసౌకర్యం కలగకుండా తల్లిదండ్రుల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని ముందుకు సాగుతామని, అవసరమైతే విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ దృష్టికి తీసుకెళ్లి సానుకూల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. డ్రాపవుట్స్ నివారణే లక్ష్యంగా చర్యలు చేపడుతున్నామన్నారు. కొత్త విధానంలో శాటిలైట్ ఫౌండేషనల్ స్కూలు, బేసిక్ ప్రైమరీ స్కూలు, మోడల్ ప్రైమరీ స్కూలు తదితర ఐదురకాల పాఠశాలలు ఏర్పాటు చేయడంపై అధికారులతో చర్చించారు. సమావేశంలో జిల్లా విద్యాశాఖాధికారి షంషుద్దీన్, మండల విద్యాశాఖ అధికారులు పాల్గొన్నారు.

పంటకుంటలను సద్వినియోగం చేసుకోవాలి

సీకేదిన్నె, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): రైతులు పంట కుంటలను సద్వినియోగం చేసుకోవాలని గ్రామీణాభివృద్ధి శాఖ జాయింట్ కమిషనర్ శివప్రసాద్ తెలిపారు. చింతకొమ్మదిన్నె మండలంలో జరుగుతున్న పంట కుంటలు, పండ్ల తోటల పెంపకం పనులను శనివారం ఆయన పరిశీలించారు. చింతకొమ్మదిన్నె, అశ్వత్థగారిపల్లెల్లో రైతులు నిర్మించుకుంటున్న పంట కుంటలను పరిశీలించి సలహాలు, సూచనలు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంట కుంటలు రైతులకు ఎంతో మేలు అని, ఇందులో నీరు పంటలకు చక్కగా ఉపయోగించుకోవచ్చన్నారు. కుంట సమీపంలో వివిధ రకాల మొక్కలు పెంచుకుని రైతులు అదనపు ఆదాయం పొందవచ్చన్నారు. రైతుకు ఎటువంటి ఖర్చు లేకుండా ఉపాధి హామీ ద్వారా ఈ పంట కుంటలు నిర్మించుకోవచ్చని తెలిపారు. ఎండలు ఎక్కువగా ఉన్నందున ఉదయం ఆరు గంటలకే పనులకు వచ్చి కొలతల ప్రకారం పనులు చేసుకోవాలన్నారు. మండలంలో 33 పంట కుంటలు మంజూరయ్యాయన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో కుళాయిబాబు, ఏపీడీ సోమశేఖర్‌రెడ్డి, ఏపీవో రామాంజనేయులరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

మున్సిపాలిటీకి రూ.90లక్షల ఆదాయం

పులివెందుల టౌన్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): పులివెందుల పురపాలక సంఘానికి సంబంధించి 2025-26 సంవత్సరానికి బహిరంగ వేలం ద్వారా రూ.90,11,000 ఆదాయం వచ్చిందని మున్సిపల్ కమిషనరు రాముడు తెలిపారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో శనివారం దిన, వారపు సంత మార్కెట్‌లో వాహనాల ఫీజులు, జంతు వధశాలకు బహిరంగ వేలంపాట నిర్వహించారు. దిన, వారపు సంత మార్కెట్‌ను సి.శ్రీనివాసరెడ్డి రూ.51,35,000లకు, నిలుపబడిన వాహనాల ఫీజు వసూలును ఈ.పద్మావతి రూ.34,35,000లకు, అలాగే జంతు వధశాలను సుశీలమ్మ రూ.4,41,000లతో దక్కించుకున్నారు. దీంతో గత సంవత్సరం కంటే రూ.12,77,000 అధికంగా పురపాలక సంఘానికి ఆదాయం వచ్చిందని కమిషనరు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, మున్సిపల్ సిబ్బంది, వేలంపాటదారులు పాల్గొన్నారు.

ప్రొద్దుటూరులో భారీ చోరీ

● 25 తులాల బంగారు ఆభరణాల అపహరణ



చోరీపై వివరాలు తెలుసుకుంటున్న సీఐ యుగంధర్

ప్రొద్దుటూరు, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరు టూటౌన్ పోలీసుస్టేషను పరిధిలోని హౌసింగ్ బోర్డు కాలనీలో శనివారం తెల్లవారుజామున చోరీ జరిగింది. ఇంట్లోవారు నిద్రలో ఉండగా దొంగలు దర్జాగా ఇంట్లోకి వచ్చి బీరువా తాళాలు తీసి 25 తులాల బంగారు ఆభరణాలు దోపిడీ చేశారు. ఆ వివరాల్లోకి వెళితే.. రాజుపాళెం మండలం టంగుటూరు గ్రామానికి చెందిన గోపిరెడ్డి శివశంకర్‌రెడ్డి తన కుమార్తె చదువుల కోసం ప్రొద్దుటూరు మండలం గోపవరం పంచాయతీలోని హౌసింగ్ బోర్డు కాలనీలో నివాసముంటున్నాడు. శనివారం రాత్రి భోజనాల తర్వాత భార్య, కూతురుతో పాటు శివశంకర్‌రెడ్డి మేడపైన బెడ్ రూములో నిద్రపోయారు. కింద ఫ్లోర్‌లో రెండు బెడ్ రూములు, మేడమీద రెండు బెడ్ రూములున్నాయి. ఒక బెడ్ రూములో తామంతా పడుకుని ఉండగా మరో బెడ్ రూముకు కేవలం గడియ పెట్టారు. తెల్లవారుజామున దొంగలు కింద ఫ్లోర్‌లోనుంచి కిచెన్ రూము తలుపులు తీసి ఇంట్లోకి చొరబడి నేరుగా పైఫ్లోర్‌కు వచ్చారు. నిద్రిస్తున్న వారు బయటికి రాకుండా ఆ గదికి దొంగలు తాళం వేశారు. మరో బెడ్ రూములో ఉన్న బీరువా తాళాలు తీసి 25 తులాల బంగారు ఆభరణాలు దొంగలించారు. తెల్లవారి 5గంటలకు నిద్రలేచిన శివశంకర్‌రెడ్డి బయటికి రావడానికి ప్రయత్నించగా తలుపులకు గడియ వేసివున్నట్లు గుర్తించారు. పక్కన ఉన్న బంధువులకు ఫోన్ చేయగా వారొచ్చి గడియ తీశారు. అప్పుడు ఇంట్లో దొంగలు పడ్డారని గ్రహించి, బీరువాలో బంగారు ఆభరణాలు చోరీ అయ్యాయని గుర్తించి వెంటనే టూటౌన్ పోలీసులకు సమాచారం ఇచ్చారు. టూటౌన్ సీఐ యుగంధర్, ఎస్ఐ ఇంటిని పరిశీలించి క్లూస్‌టీములతో వేలిముద్రల సేకరించారు. అలాగే పోలీసు జాగిలంతో పరిశీలించగా అది హౌసింగ్ బోర్డు నుంచి మదూరు రోడ్డు వరకు వచ్చి ఆగిపోయింది. దొంగలను పట్టుకోవడానికి ప్రత్యేక టీములతో గాలింపు మొదలుపెట్టారు. చుట్టుపక్కల ఉన్న సీసీ కెమెరాలను పరిశీలిస్తున్నారు. కాగా వారం కిందటే రూరల్ పోలీసుస్టేషను పరిధిలోని కొత్తపల్లె పంచాయతీ గెటెడ్ కమ్యూనిటీకి చెందిన లక్ష్మీనగర్ కాలనీలో తాళం వేసిన ఇంట్లో దొంగలు పడి భారీ దోపిడీకి పాల్పడ్డారు. దాదాపు 85 తులాల బంగారంతో పాటు 7లక్షల నగదు అపహరించుకుపోయారు. ఈ వరుస దొంగతనాలు ప్రొద్దుటూరు పోలీసులకు పెద్ద సవాల్‌గా మారాయి.

మహిళపై దాడి కేసును ఛేదించిన పోలీసులు

● నిందితుడి అరెస్టు.. రిమాండుకు తరలింపు



మాట్లాడుతున్న డీఎస్పీ వెంకటేశ్వర్లు

కమలాపురం రూరల్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): ఇంట్లోకి చొరబడి ఒంటరిగా ఉన్న మహిళ కంట్లో కారంపొడి కత్తితో దాడి చేసిన వ్యక్తిని అరెస్టు చేసి రిమాండుకు తరలించామని డీఎస్పీ వెంకటేశ్వర్లు తెలిపారు. శనివారం సాయంత్రం కమలాపురం పోలీసుస్టేషన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. ఈనెల 13న కమలాపురం గిడ్డంగివీధిలో లక్ష్మీదేవి అనే మహిళపై కత్తితో దాడి చేసి బంగారు నగలు అపహరించుకుపోయిన ఆకుల నవీన్ వల్లూరు మండలం తోళ్లగంగనపల్లె క్రాస్ వద్ద ఉండగా సీఐ రోషన్, సీసీఎస్ సీఐ భాస్కర్‌రెడ్డి, ఎస్ఐ ప్రతాప్‌రెడ్డి అరెస్టు చేశారని, అతని వద్ద నుంచి బంగారు నగలు, దాడికి ఉపయోగించిన ఆయుధం స్వాధీనం చేసుకున్నామన్నారు. నవీన్ ఇంటర్ వరకు చదవి క్రికెట్ బెట్టింగ్, గ్యాంబ్లింగ్‌కు బానిస అయ్యాడని, ఫిర్యాదుదారి లక్ష్మీదేవి వద్ద రూ.30 వేలకు తన సెల్‌ఫోన్ తాకట్టు పెట్టాడని, ఆ అప్పు తీర్చలేక ఆమెను చంపాలని కత్తితో దాడి చేసి బంగారు నగలు దోచుకెళ్లాడన్నారు. కార్యక్రమంలో ఏఎస్సై వెంకటరమణ, హెడ్‌కానిస్టేబుల్ కొండారెడ్డి పాల్గొన్నారు.

వలంటీర్లను విధుల్లోకి తీసుకోవాలి

ప్రొద్దుటూరు టౌన్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు వలంటీర్లను విధుల్లోకి తీసుకోవాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి సత్యనారాయణ పేర్కొన్నారు. శనివారం సీఐటీయూ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వం నాలుగు లక్షల మంది వలంటీర్లను తీసుకుని రూ.5 వేలు వేతనం చెల్లించిందన్నారు. వలంటీర్లను కొనసాగిస్తామని, నెలకు రూ.10 వేలు వేతనం చెల్లిస్తామని ఎన్నికల్లో టీడీపీ అధినేత బహిరంగ సభల్లో హామీ ఇచ్చారన్నారు. 9 నెలలుగా ప్రభుత్వం వలంటీర్లకు వేతనాలు చెల్లించడంలేదన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు వలంటీర్లను విధుల్లోకి తీసుకుని వేతన బకాయిలను చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఈనెల 17వ తేదీ విజయవాడలో ధర్నా నిర్వహిస్తున్నామని, వలంటీర్లు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో డీవైఎఫ్ఐ కార్యదర్శి విశ్వనాథ్, ఆటోయూనియన్ కార్యదర్శి శ్రీను, లక్షుమయ్య, పాల్గొన్నారు.

కారు, ద్విచక్ర వాహనం ఢీకొని వ్యక్తి మృతి



రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన సుధీర్

బద్వేలుటౌన్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని జాతీయ రహదారి మైదుకూరురోడ్డులోని టీటీడీ కళ్యాణమండపం సమీపంలో కారు, ద్విచక్రవాహనం ఢీకొని తుంగ సుధీర్(35) మృతి చెందాడు. వివరాల్లోకి వెళితే.. వెంకటయ్యనగర్‌కు చెందిన తుంగ సుధీర్(35) జీవనోపాధి కోసం కువైట్‌కు వెళ్లి ఇటీవల ఇంటికి వచ్చాడు. ఇంటి వద్ద కూడా జీవనోపాధి కోసం డ్రైవర్‌గా వెళుతుండేవాడు. శనివారం రాత్రి ఓ వివాహవేడుకకు వెళ్లి తిరిగి ద్విచక్రవాహనంలో ఇంటికి వస్తుండగా, కొన్ని క్షణాల్లో ఇంటికి చేరుతాడన్న సమయంలో నెల్లూరు నుంచి మైదుకూరు వైపు వేగంగా వచ్చిన కారు ఢీకొనడంతో సుధీర్ కిందపడ్డాడు. గమనించిన స్థానికులు, బంధువులు 108వాహనంలో ప్రభుత్వాసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారణ చేశారు. మృతుడికి భార్య ప్రమీళ, కుమారుడు భార్గవ్, కుమార్తె తరుణి కలరు.

పరిశుభ్రత కోసం సమయం కేటాయించాలి : డీపీఆర్‌సీ ఏవో

కడప రూరల్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): జిల్లా పంచాయతీ వనరుల కేంద్రం (డీపీఆర్‌సీ)లో పనిచేసే ప్రతి అధికారి, ఉద్యోగి, సిబ్బంది పరిసరాల పరిశుభ్రత కోసం ప్రతిరోజూ కొంత సమయం కేటాయించాలని డీపీఆర్‌సీ ఏవో బండపల్లి నాగభూషణం పేర్కొన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు డీపీఆర్‌సీ ప్రిన్సిపల్(జడ్పీసీఈవో) ఓబులమ్మ, వైస్ ప్రిన్సిపల్ (డీపీవో) రాజ్యలక్ష్మి నేతృత్వంలో శనివారం జడ్పీ ఆవరణలోని డీపీఆర్‌సీలో పరిసరాలను పరిశుభ్రం చేసి స్వచ్ఛఆంధ్ర ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం చేపట్టే స్వచ్ఛత కార్యక్రమాల కోసం శ్రమదానం చేసి పరిశుభ్ర ఆంధ్రప్రదేశ్ సాధించేందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. అలాగే తోటివారికి కూడా స్వచ్ఛత కోసం తడిచెత్త, పొడిచెత్తను వేరు చేయటంపై అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో డీపీఆర్‌సీ ట్రైనింగ్ మేనేజర్ ఏవీ సురేశ్‌కుమార్, ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఏఆర్ ఏఎస్ఐ సస్పెన్షన్

కడపక్రైం, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): ఏఆర్ ఏఎస్ఐగా పని చేస్తున్న రమణారెడ్డిని సస్పెండ్ చేస్తూ పోలీసు ఉన్నతాధికారులు శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. ఏఎస్ఐ రమణారెడ్డి ఉద్యోగాల పేరుతో పలువురి నుంచి డబ్బులు వసూలు చేశాడన్న ఆరోపణలు ఉన్నాయి. తీసుకున్న డబ్బులు తిరిగి ఇవ్వకపోవడంతో బాధితుల ఫిర్యాదు మేరకు అధికారులు విచారణ చేపట్టారు. ఏఎస్ఐపై ఆరోపణలు నిజం కావడంతో సస్పెండ్ చేశారు.

గ్రావెల్ అక్రమంగా తరలిస్తున్న వాహనాలు సీజ్

కడప కలెక్టరేట్ మార్చి15(ఆంధ్రజ్యోతి) నగర శివారు చిన్నచౌకు గ్రామ పొలంలో సర్వే నెంబరు 919లో నుంచి గ్రావెల్‌ను అక్రమంగా తరలిస్తున్న 2 టిప్పర్లు, 1 ట్రాక్టర్‌ను రెవెన్యూ అధికారులు శనివారం సీజ్ చేశారు. ఆ వాహనాలను తహశీల్దారు కార్యాలయానికి తరలించారు. కార్యక్రమంలో మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ ఈశ్వర్, వీఆర్వోలు భాస్కర్‌రెడ్డి, శ్రీనివాసులు, సుబ్బరాయుడు, పాల్గొన్నారు.

ప్లాస్టిక్‌తో పర్యావరణానికి ముప్పు

● డిప్యూటీ సీఈవో మైథిలి



రైల్వేకోడూరు: ప్లాస్టిక్‌పై ప్రజలకు అవగాహన కల్పిస్తున్న జిల్లా డిప్యూటి సీఈవో మైథిలి



ఓబులవారిపల్లి: నాయకులు, కార్యకర్తలు, ప్రజలతో ప్రతిజ్ఞ చేస్తున్న ముక్కా రూపానందరెడ్డి

రైల్వేకోడూరు, మార్చి 15(ఆంధ్రజ్యోతి): సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌తో పర్యావరణానికి ముప్పు వాటిల్లుతుందని డిప్యూటీ సీఈవో మైథిలి తెలిపారు. శనివారం రైల్వేకోడూరు లో ప్లాస్టిక్ వాడకంపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్లాస్టిక్ సముద్రాలను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయన్నారు. తద్వారా సముద్ర జీవులకు హాని కల్గిస్తున్నాయన్నారు. తాబేళ్లు, సీల్స్, పక్షులు, జంతువులు ప్లాస్టిక్ వ్యర్థాలలో చిక్కుకుని గాయాలు, మరణానికి గురవుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. అనేక దేశాలు ప్లాస్టిక్ సంచులు, స్ట్రాలు, సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌లను నిషేధించాయన్నారు. రీసైక్లింగ్ కోసం టేక్-బ్యాక్ కార్యక్రమాలను అమలు చేసే దిశగా ప్రభుత్వాలు చర్యలు తీసుకుంటున్నాయన్నారు. ప్రపంచ వ్యాప్తంగా 9 శాతం ప్లాస్టిక్ వ్యర్థాలను మాత్రమే రీసైకలింగ్ చేస్తున్నారన్నారు.చాలా వరకు ప్లాస్టిక్‌ను పూడ్చి పెట్టడం, కాల్చి వేయడం చేయాలన్నారు. ప్రతి ఏటా దాదాపు 8 మిలియన్ టన్నుల ప్లాస్టిక్ వ్యర్థాలు సముద్రంలోకి చేరుకున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఒక ప్లాస్టిక్ సంచి సగటున 12 నిమిషాలు ఉపయోగించబడుతుందన్నారు. కానీ కుళ్లిపోవడానికి 1000 సంవత్సరాలు పడుతుందన్నారు. ప్రపంచ వ్యాప్తంగా ప్రతి నిమిషానికి 1 మిలియన్ ప్లాస్టిక్ బాటిళ్లు కొనుగోలవుతున్నాయన్నారు. 2050 నాటికి సముద్రంలో ప్లాస్టిక్ బరువు అన్ని చేపల బరువును మించి పోతుందన్నారు. బాధ్యత గల పౌరులు ఒక సారి ఉపయోగించే ప్లాస్టిక్‌లను తిరస్కరించాలని తెలిపారు. పర్యావరణ అనుకూల ప్రత్యామ్నాయాలను ఎంచుకోవడం ద్వారా ప్లాస్టిక్ వినియోగం పూర్తి గా తగ్గిపోతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో నాగార్జున రావు, రైల్వేకోడూరు పంచాయతీ ఈవో వరప్రసాద్‌రావు, టీడీపీ యువ నాయకులు పోతురాజు నవీన్, నార్జాల హేమరాజ్ తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు ప్రజలు తోడ్పడాలి

పర్యావరణ పరిరక్షణకు ప్రజలు తోడ్పడాలని జిల్లా డిప్యూటీ సీఈవో మైథిలి తెలిపారు. శనివారం రైల్వేకోడూరు ఎంపీడీవో కార్యాలయంలో అధికారులలో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజలు స్వచ్ఛ భారత్ కార్యక్రమంలో స్వచ్ఛందంగా పాల్గొన్నాలని తెలిపారు. అధికారులు, సర్పంచులు, వార్డు సభ్యులు అందరూ కలిసి స్వచ్ఛ భారత్ కార్యక్రమాన్ని విజయవంతంగా చేస్తామని ప్రతిజ్ఞ చేశారు.

వాడి పారేసే ప్లాస్టిక్‌ను అమ్మితే రూ.లక్ష జరిమానా

పెనగలూరు, మార్చి 15 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని అన్ని రకాల వ్యాపారులు, దుకాణాల యజమానులు ఒకసారి వాడి పారేసి ప్లాస్టిక్ వస్తువులను ప్రజలకు అమ్మితే రూ.లక్ష వరకు జరిమానా ఉంటుందని ఎంపీడీవో ఎస్.విజయరావు హెచ్చరించారు. శనివారం స్వర్ణాంధ్ర- స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా కోమంతరాజపురం పంచాయతీ పరిధిలోని బెస్తపల్లె మూడు రోడ్ల కూడలిలో గల దుకాణ యజమానులతో ఆయన మాట్లాడారు. పెనగలూరులో టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి బాలకృష్ణ, పార్లమెంట్ తెలుగు యువత ఉపాధ్యక్షుడు రాంప్రసాద్‌నాయుడు, మండల నాయకుడు నరేష్ బాబు పాల్గొన్నారు. ఈటమాపురం పాఠశాలలో కోఆప్షన్ సభ్యుడు, టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జి పుచ్చకాయల రవికుమార్, విద్యార్థులకు ప్లాస్టిక్ భూతం నివారణపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు.

రామాపురం: రామాపురం ప్రభుత్వ కార్యాలయాల సముదాయంలో రెవెన్యూ అధికారులు, సిబ్బందితో కలిసి స్వర్ణాంధ్ర, స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. చెత్తను శుభ్రం చేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ కృపావతి, ఆర్ఐ సమ్మద్‌ఖాన్, వీఆర్‌వోలు, సిబ్బంది పాల్గొన్నారు.

ఓబులవారిపల్లె: టీడీపీ అధినేత, ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడి ఆశయాలను నెరవేరుద్దాం అని టీడీపీ ఇన్‌చార్జి ముక్కా రూపానందరెడ్డి అన్నారు. శనివారం ఆయన నాయకులు, గ్రామస్థులతో కలిసి ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో మల్‌రెడ్డి, తహసీల్దారు శ్రీధర్‌రావు, ఈవోపీఆర్డీ రామ్మోహన్‌రెడ్డి, సర్పంచ్ రవిచంద్రారెడ్డి పాల్గొన్నారు.



పుల్లంపేటలో స్వచ్ఛ ఆంధ్రపై చేపట్టిన మానవహారం

ప్లాస్టిక్‌ను నిషేధించడం మనందరి బాధ్యత

నందలూరు, మార్చి 15 (ఆంధ్రజ్యోతి) : ప్లాస్టిక్ కవర్లను నిషేధించడం మనందరి బాధ్యత అని మండల ప్రత్యేకాధికారి రామచంద్రనాయక్, తహసీల్దారు పుల్లారెడ్డి, ఎంపీడీవో రాధాకృష్ణంరాజు, నాగిరెడ్డిపల్లె మేజర్ గ్రామ పంచాయతీ సర్పంచ్ జంబు సూర్యనారాయణ అన్నారు. శనివారం మండలంలోని నాగిరెడ్డిపల్లె మేజర్ పంచాయతీ పరిధిలో స్వచ్ఛత సేవా కార్యక్రమంలో భాగంగా రోడ్ల భవనాల అతిథి గృహం నుంచి బస్టాండు వరకు ర్యాలీ నిర్వహించి మానవహారం చేపట్టారు.

పరిశుభ్రతతో అంటువ్యాధులు దూరం

సిద్దవటం, మార్చి 15 (ఆంధ్రజ్యోతి) : పరిశుభ్రతతో అంటువ్యాధులు దూరమవుతాయని సిద్దవటం పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రకాష్ తెలిపారు. సిద్దవటం 30 పడకల ప్రభుత్వ ఆసుపత్రిలో శనివారం స్వర్ణాంధ్ర, స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం జరిగింది. ఆసుపత్రి ఆవరణంలో చెత్త చెదారాన్ని తొలగించారు.

పుల్లంపేట : సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వాడకాన్ని నిర్మూలిద్దామని ఏవో శ్రీధర్‌రెడ్డి, సర్పంచ్ ఆకేపాటి శ్రీనివాసులరెడ్డి ఆధ్వర్యంలో శనివారం పుల్లంపేటలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. సచివాలయ సిబ్బంది విద్యార్థులతో ర్యాలీ నిర్వహించి నాలుగురోడ్ల కూడలిలో మానవహారం చేపట్టారు.

చిన్నమండెం : స్థానిక ఏపీ మోడల్ స్కూల్‌లో శనివారం జాతీయ సేవా పథకం స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ ఆరోగ్యమే మహాభాగ్యం అని పచ్చదనంపై విద్యార్థులకు వివరించారు.

సుండుపల్లె: పారిశుధ్యమే పరమావధిగా ప్రతి ఒక్కరూ ప్రతి శనివారం స్వచ్ఛ ఆంధ్ర - స్వచ్ఛ భారత్ కార్యాక్రమాన్ని నిర్వహించాలని వైద్యాధికారి శేఖర్‌రెడ్డి తెలిపారు. శనివారం మండలంలో రాయవరం ప్రాథమిక వైద్య కేంద్రంలో సిబ్బందితో స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని నిర్వమించారు.

సభను విజయవంతం చేసిన అందరికీ ధన్యవాదాలు

సిద్దవటం, మార్చి 15 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర డిప్యూటీ సీఎం, జనసేన పార్టీ అధ్యక్షుడు కొణిదెల పవన్‌కళ్యాణ్ పిలుపు మేరకు పార్టీ 12వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలకు వచ్చిన ప్రతి జనసైనికుడు, వీర మహిళలకు రాజంపేట నియోజకవర్గ పార్లమెంట్ సమన్వయ కార్యకర్త అతికారి క్రిష్ణ ధన్యవాదాలు తెలిపారు. తన నివాసంలో శనివారం ఆయన మాట్లాడుతూజనసైనికులు, వీర మహిళలు ఊహించని రీతిలో పాల్గొనడం వైసీపీకి వణుకు పుట్టిందన్నారు. ఆవిర్భావ సభకు వచ్చిన ప్రతి జనసైనికులకు, వీర మహిళలకు ప్రత్యేక కృతజ్ఞలు తెలియజేశారు.

అక్రమ నిర్మాణాలపై సర్వే

పుల్లంపేట, మార్చి 15 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని రాయచోటి రోడ్డులో గల ఎస్ఆర్‌పాలెం గ్రామంలో ఆర్ అండ్ బి స్థలాలను ఆక్రమించి నిర్మాణాలు చేపట్టడంతో రెవెన్యూ, ఆర్ అండ్ బీ అధికారులు సంయుక్తంగా సర్వే నిర్వహించారు. వత్తలూరు ప్రాంతానికి చెందిన దుగ్గి గంగాధర్ ఫిర్యాదు మేరకు అధికారులు సర్వే చేశారు. ఆర్ అండ్ బి స్థలాలను ఆక్రమించి నిర్మాణాలు చేపట్టారని సర్వేలో తేలడంతో హద్దులు ఏర్పాటు చేశారు. పుల్లంపేట మండల సర్వేయర్ శ్రీరాములు, సచివాలయ సర్వేయర్‌లు శశిధర్, శ్యామల పాల్గొన్నారు.

తాగునీటి సమస్యను పరిష్కరించండి

లక్కిరెడ్డిపల్లె, మార్చి 15(ఆంధ్రజ్యోతి): పందెళ్లపల్లె కస్బాలో గత 20 రోజులుగా నెలకొన్న నీటి సమస్యను పరిష్కరించాలని సీపీఐ కార్యదర్శి సిద్దిగాళ్ల శ్రీనివాసులు పేర్కొన్నారు. తాగునీరు ట్యాంకర్ల ద్వారా నీరు అందించాలన్నారు. శనివారం సచివాలయం ఎదుట ఖాళీ బిందెలతో నిరసన తెలిపారు.

చిత్రం చెప్పిన సమస్య



లక్కిరెడ్డిపల్లె మండలం పాళెంగొల్లపల్లె పంచాయతీ చిన్నపోతులపల్లెలోని ప్రాథమిక పాఠశాల ఎదుట మురికినీరు ప్రవహిస్తోంది. ఆ మురికినీటిలో నుంచి పాఠశాల లోపలికి రావాలన్నా, మధ్యాహ్న భోజనం చేయాలన్నా విద్యార్థులు ఇబ్బందిపడుతున్నారు. అలాగే బోరు చుట్టూ ప్రహరీ ఏర్పాటు చేసి విద్యుత్‌వైర్లు పిల్లలకు అందకుండా చూడాలని వారి తల్లిదండ్రులు విన్నవిస్తున్నారు.

- లక్కిరెడ్డిపల్లె, (ఆంధ్రజ్యోతి)

PUBLIC NOTICE

Under the instructions of my client M/s. Shriram Finance Ltd. Kadapa - 1 Branch, Kadapa Post & Dt. A.P. I hereby given the public notice that Sri Kota Abhiashek s/o Chandra Sekhar, D.No: 6/460, R.S. Road, Rajampet Post & Mdl, Annamaiah Dt. A.P. has applied for a loan from my clients Finance Ltd., by mortgaging the schedule mentioned property which stands in his name. If anybody has got any objections with regard to the schedule mentioned properties, file their objections before my client's Office or in my Office within 7 days of this publication, failing which, loan will be sanctioned and issued to the applicant. **SCHEDULE 1 for the Doc. No: 972/2025:** The vacant site is situated at Annamaiah Dist. Rajampet Sub Dist. Utukur Grama Panchayath, Utukur Grama Polam, an extent of Ac. 0.07 cents 262 Chadarapu links in Plot No: 19 & 20 out of an extent of Ac. 0.89 cents in S. No: 146/1A and an extent of Ac. 0.38 cents in S. No: 146/1. **BOUNDARIES FOR PLOT NO: 19** East : 17 Feet width Road, West: Land of Kambaiahgari Lakshmaiah and Kambaiahgari Gopal. North: Plot No:.20 & Road, South: Plot No: 18. **Measurements of Plot No: 19:-** East to West: Northern Side: 66 Feet [20.13 Mtrs], Southern Side: 67 Feet [20.43 Mtrs], North to South: Eastern Side: 33.2 Feet [10.12 Mtrs], Western Side: 30 Feet [9.15 Mtrs], Total extent of Plot No: 19 is 233.48 Chadarapu Gajamulu, **BOUNDARIES FOR PLOT NO: 20 :** East: 17 Feet width Road, West : Road, North: Road, South: Plot No: 19. **Measurements of Plot No: 19:-** East to West: Northern Side: 0 Feet [0 Mtrs], Southern Side: 33 Feet [10.06 Mtrs], North to South: Eastern Side: 67.7 Feet [20.67Mtrs], Western Side: 84 Feet [25.62 Mtrs],Total extent of Plot No: 20 is 118 Chadarapu Gajamulu, **SCHEDULE 1 for the Doc. No: 973/2025 :** The vacant site is situated at Annamaiah Dist. Rajampet Sub Dist. Utukur Grama Panchayath, Utukur Grama Polam, an extent of Ac. 0.06 cents 974 Chadarapu links in Plot No: 2 & 21 out of an extent of Ac. 0.89 cents in S. No: 146/1A and an extent of Ac. 0.38 cents in S.No: 146/1. [Ac. 1.27 cents] **BOUNDARIES FOR PLOT NO: 2:** East: Plot No: 21West : 17 Feet width Road, North: Plot No: 3, South: Plot No: 1, **Measurements of Plot No: 2:-** East to West: Northern Side: 44.9. Feet [13.69 Mtrs], Southern Side: 36.3 Feet [11.07 Mtrs], North to South: Eastern Side: 35.01 Feet [10.70 Mtrs] Western Side: 35.8 Feet [10.91Mtrs], Total extent of Plot No: 2 is 159.91 Chadarapu Gajamulu, **BOUNDARIES FOR PLOT NO: 21 :** East : 13 Feet width Road, West: Plot No: 2 North: Others siteSouth: Plot No: 22. **Measurements of Plot No: 21:-** East to West: Northern Side: 46.4 Feet [14.15 Mtrs], Southern Side: 46.3 Feet [14.12 Mtrs], North to South: Eastern Side: 33.9 Feet [10.33 Mtrs], Western Side: 35.1 Feet [10.70 Mtrs],Total extent of Plot No: 21 is 177.67 Chadarapu Gajamulu

S. KRISHNA KUMAR, M.A., B.L.
S. GIREESH KUMAR, M.Tech. LLM
Advocates, Rajampet

గ్రామాలను ఆదర్శంగా తీర్చిదిద్దుతాం

● మంత్రి రాంప్రసాద్‌రెడ్డి



సీసీ రోడ్డును ప్రారంభిస్తున్న మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి

చిన్నమండెం, మార్చి15(ఆంధ్రజ్యోతి): ప్రతి గ్రామంలో సిమెంటు రోడ్లు, డ్రైనేజీ కాలువలు, వీధిలైట్లు ఏర్పాటు చేసి గ్రామాలను ఆదర్శంగా తీర్చిదిద్దుతామని రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం చిన్నమండెం మండలం మోతినగర్‌లో రూ.7.50 లక్షలతో నిర్మించిన సిమెంటు రోడ్డును మంత్రి ప్రారంభించారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాయచోటి నియోజకవర్గంలోని ప్రతి గ్రామాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దడమే తమ లక్ష్యమన్నారు. దీంతో ప్రాధాన్యత క్రమంలో ప్రతి గ్రామంలో సిమెంటు రోడ్లు, డ్రైనేజీ కాలువలు, వీధిలైట్లు ఏర్పాటు చేస్తామన్నారు. అనంతరం రూ.2 లక్షలతో ఏర్పాటు చేసిన మోటారును స్విచ్ ఆన్ చేసి గ్రామానికి నీటి సరఫరా చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు టీడీపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు అందించడమే లక్ష్యం

రాయచోటిటౌన్, మార్చి15(ఆంధ్రజ్యోతి): జిల్లాలో అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు అందించడమే తమ ధ్యేయమని రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం రాయచోటి పట్టణంలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో ప్రజాదర్బార్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గత ప్రభుత్వ నిర్లక్ష్య కారణంగా ప్రజలు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నారని, కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ప్రజల సమస్యలు అక్కడికక్కడే పరిష్కరిస్తున్నామన్నారు.

'పది' పరీక్షలకు సర్వం సిద్ధం



రైల్వేకోడూరు: పరీక్షా కేంద్రాన్ని పరిశీలిస్తున్న విద్యాశాఖాధికారి కోదండనాయుడు

రైల్వేకోడూరు,మార్చి15(ఆంధ్రజ్యోతి): పది పరీక్షలు సోమవారం నుంచి నిర్వహించను న్నారు. ఈ మేరకు శనివారం ఆయా పరీక్షా కేంద్రాలను రైల్వేకోడూరు విద్యాశాఖాధికారి ఏ. కోదండ నాయుడు-1, డి.సుందర్‌బాబు-2 పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పది పరీక్షలకు సర్వం సిద్ధం చేశామన్నారు. విద్యార్థులకు ఎలాంటి సమస్యలు రానివ్వమని పేర్కొన్నారు. రైల్వేకోడూరులో ఆరు కేంద్రాల్లో మొత్తం 1173 మంది విద్యార్థులు పరీక్షలు రాస్తారన్నారు. మాస్‌కాపీయింగ్, కాపీలు అందించేందుకు వీలు లేకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకున్నామన్నారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందన్నారు.

లక్కిరెడ్డిపల్లె: పదోతరగతి పరీక్షా కేంద్రాల్లో అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని ఎంఈఓ చక్రేనాయక్ తెలిపారు. మండలంలోని 10 జెడ్పీ పాఠశాలల్లో సుమారు 504 మంది పరీక్షలు రాయనున్నారన్నారు.

నేడు ఉచిత వినికిడి పరీక్ష శిబిరం

రాజంపేట టౌన్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి) : రత్న స్పీచ్ అండ్ హియరింగ్ సెంటర్‌లో ఉచిత వినికిడి పరీక్ష శిబిరం ఆదివారం నిర్వహిస్తున్నట్లు స్పీచ్ థెరపిస్ట్ బాబు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వినికిడి పరీక్షలు ఆర్‌సీఐ సర్టిఫైడ్ థెరపిస్టులచే ఉచితంగా స్పీచ్ క్లీనింగ్ నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ పరీక్షలన్ని ఉచితంగా ఆది సొసైటీ ఫర్ అప్లిఫ్మెంట్ ఆఫ్ రూరల్ ఎకనామి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు.

చల్లంగ చూడవమ్మా...దండువారమ్మ తల్లి



దండువారమ్మ జాతర సందర్భంగా పూజలు చేస్తున్న సుగవాసిని ఆశీర్వదిస్తున్న దృశ్యం

రాయచోటిటౌన్, మార్చి15(ఆంధ్రజ్యోతి): అమ్మల గన్న అమ్మ దండువారమ్మ తల్లి ప్రజలందరినీ చల్లగా చూడవమ్మా అని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సుగవాసి ప్రసాద్‌బాబు అన్నారు. శనివారం అన్నమయ్య జిల్లా కేంద్రమైన రాయచోటి పట్టణంలోని పాతరాయచోటిలో వెలిసియున్న శ్రీదండువారమ్మ తల్లి జాతర మహోత్సవ కార్యక్రమాన్ని ఆలయ కమిటీ సభ్యులు ఆహ్వానం మేరకు తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి, టీటీడీ పాలక మండలి మాజీ సభ్యులు, రాయచోటి నియోకవర్గ టీడీపీ సీనియర్ నాయకులు సుగవాసి ప్రసాద్‌బాబు హాజరై దండువారమ్మ తల్లికి ప్రత్యేక పూజలు చేసి తీర్థప్రసాదాలు అందజేశారు.

గోమాతలను ఇబ్బందిపెట్టవద్దు

● టీడీపీ సీనియర్ నేత డాక్టర్ జీఎన్ నాయుడు

రాజంపేట, మార్చి 15 (ఆంధ్రజ్యోతి) : గోమాతలను ఇబ్బందిపెట్టవద్దని టీడీపీ రాష్ట్ర సీనియర్ నాయకుడు, రీజెన్సీ సిరామిక్ పరిశ్రమల అధినేత డాక్టర్ జీఎన్‌నాయుడు పేర్కొన్నారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పట్టణంలో కొందరు గోమాతలను విచ్చలవిడిగా వదిలి వేస్తున్నారన్నారు. దీనివల్ల వందలాది ఆవులు, పట్టణ రోడ్లపై ఎక్కడ పడితే అక్కడ ప్లాస్టిక్ వ్యర్థాలను, ఇతర పేపర్లను తింటున్నాయన్నారు. హిందువులకు గోమాతలు ఆరాధ్యదైవాలు లాంటివన్నారు. అటువంటి వాటికి ప్లాస్టిక్ వ్యర్థాలు పెడుతూ వాటి వినాశనానికి పాటుపడడం తగదన్నారు.

కరపత్రాల ఆవిష్కరణ

నందలూరు, మార్చి 15 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని నాగిరెడ్డిపల్లె బాలికల జూనియర్ కళాశాల కరపత్రాలను శనివారం ఆవిష్కరించారు. స్థానిక ఉన్నత పాఠశాల ఆవరణంలో కొనసాగుతున్న బాలికల జూనియర్ కళాశాల 2 సంవత్సరాలు దిగ్విజయంగా పూర్తి చేసుకుని మూడో సంవత్సరంలోకి అడుగుపెడుతున్న సందర్భంలో పదో తరగతి పరీక్షలు రాసే విద్యార్థులకు శుభాకాంక్షలు తెలుపుతూ వారు కరపత్రాలను ముద్రించి ఆవిష్కరించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు జయలలితకుమారి, మండల విద్యాశాఖ అధికారులు నాగయ్య, అనంతకృష్ణలు, ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సంక్షిప్తం

ప్రార్థనలు ప్రశాంతంగా జరుపుకోవాలి



ముస్లిం పెద్దలతో మాట్లాడుతున్న ఎస్ఐ రవిప్రకాష్‌రెడ్డి

పెనగలూరు, మార్చి 15 (ఆంధ్రజ్యోతి) : రంజాన్ పర్వదినం సందర్భంగా ఈద్గా ప్రార్థనలు ప్రశాంతంగా జరుపుకోవాలని పెనగలూరు ఎస్ఐ బి.రవిప్రకాష్‌రెడ్డి, ముస్లిం మైనార్టీ పెద్దలకు సూచించారు. పెనగలూరు ఉన్నత పాఠశాల ఎదురుగా ఉన్న శ్మశాన ప్రాంగణంలో గల కొత్త, పాత ఈద్గా స్థలాలను ఆయన పరిశీలించారు. గత కొంత కాలంగా ఇరువర్గాల మధ్య భేదాభి ప్రాయాలు ఉండటంతో ఎస్ఐ మతపెద్దలతో మాట్లాడారు. పాత విషయాలను తవ్వుకుంటూ పోతే నష్టపోతారని,అందరూ కలిసి ఒకేచోట ప్రార్థనలు జరుపుకోవాలన్నారు.

ఇంటర్ ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

పెనగలూరు, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని పెనగలూరు ఆదర్శ పాఠశాల జూనియర్ కళాశాలో ఇంటర్మీడియట్ అడ్మిషన్లకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.సహజ బ్లెస్సి తెలిపారు. పదో తరగతి పాసైన విద్యార్థులు 2025-26 విద్యా సంవత్సరానికి గాను ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం బైపీసీ, ఎంపీసీ, సీఈసీ గ్రూపుల్లో చేరేందుకు 22వ తేదీ లోపు ఆన్‌లైన్‌లో ఫీజు చెల్లించి పేరు రిజిస్టర్ చేసుకోవాలని ఆమె పేర్కొన్నారు.

పశువుల సంత వేలం వాయిదా

రామాపురం,మార్చి15(ఆంధ్రజ్యోతి):మండల కేంద్రంలో వారంతపు శనివారం నిర్వహించే పశువుల సంత, బస్టాండు గేటు వేలం ఈ నెల 20 సాయంత్రం 3 గంటలకు వాయిదా పడింది. శనివారం సాయంత్రం 3 గంటలకు సంత నల్లగుట్టపల్లె సర్పంచ్ అయోధ్యాపురం నాగభూషణ్‌రెడ్డి ఆదేశాల మేరకు సంత వేలం నిర్వహించారు. ప్రభుత్వం నిర్ణయించిన రేటు ఎక్కువగా ఉందని సభ్యులు పాట పాడకపోవడంతో వేలం పాట వాయిదా పడిందని ఆయన తెలిపారు. మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ రమేశ్‌రెడ్డి, ఈవోపీఆర్డీ పట్నాయక్, పంచాయతీ కార్యదర్శి నాగరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడి


లక్కిరెడ్డిపల్లె, మార్చి 15(ఆంధ్రజ్యోతి): రైతులు యాజమాన్యపద్ధతులు పాటిస్తే అధిక దిగుబడి పొందవచ్చుని ఏడీఏ జయరాణి పేర్కొన్నారు. జాతీయ మిషన్ వంట నూనెలు, నూనెగింజల పథకం కింద డివిజన్ స్థాయిలోని వీరబల్లి, లక్కిరెడ్డిపల్లె, గాలివీడు, రామాపురం మండలాల రైతులకు శనివారం శిక్షణ నిర్వహించారు. సందర్భంగా ఆమె మాట్లాడుతూ నూనెగింజల ఉత్పత్తిని జిప్సం, సూక్ష్మపోషకాలు అందిచడం ద్వారా అధిక దిగుబడి సాధించవచ్చున్నారు. రైతు శిక్షణా కేంద్రం ఏడీలు రామక్రిష్ణరాజు, సుచిత్ర, స్వాతి, ఏఈఓ వంతోషమ్మ, అనూష, కెరోలిన్, చాన్‌బాషా, రమేష్‌రెడ్డి పాల్గొన్నారు.

పరీక్షా సామగ్రి పంపిణీ

రైల్వేకోడూరు, మార్చి 15(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ, ప్రైవేటు విద్యాలయాల విద్యార్థులకు ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో టాలెంట్ టెస్టని ర్వహించి విద్యా సామగ్రి అందజేసినట్లు ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు లతీఫ్ తెలిపారు. ట్యాలెంట్ టెస్టులో దాదాపు 500 మంది పాల్గొన్నారన్నారు. ఎస్ఎఫ్ఐ నాయకులు గోవర్ధన్, రాకేష్, రోహిత్ పాల్గొన్నారు.

సంబేపల్లె: పదవ తరగతి పబ్లిక్ పరీక్షలు రాసేందుకు అవసరమైన పరీక్ష సామగ్రిని సంబేపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం విశ్రాంత తెలుగు ఉపాధ్యాయులు వెంకట్రామరాజు విద్యార్థులకు పంపిణీ చేశారు. పెన్ను, పెన్సిల్, స్కేల్, ఎరేజర్, రబ్బరులతో కూడిన కిట్‌ను పాఠశాలలోని 96 మంది విద్యార్థులకు వెంకట్రామరాజు ఆర్థిక సహకారం అందించినట్లు హెచ్ఎం మడితాడు నరసింహారెడ్డి తెలిపారు.

జనసేన కార్యకర్త మృతి




బీగాల వాసు (ఫైల్)

సిద్దవటం, మార్చి 15 (ఆంధ్రజ్యోతి) : కామెర్ల వ్యాధితో జనసేన పార్టీ క్రియాశీలక కార్యకర్త బీగాల వాసు శనివారం మృతిచెందినట్లు వారి కుటుంబ సభ్యులు తెలిపారు. రాజంపేట నియోజకవర్గ పార్లమెంట్ సమన్వయకర్త అతికారి క్రిష్ణ, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి బి.హరిప్రసాద్, పంచాయతీ రాజ్ రాష్ట్ర కమిటీ ఆర్గనైజింగ్ సెక్రటరీ బి.హరిప్రసాద్, పంచాయతిరాజ్ రాష్ట్ర కమిటీ ఆర్గనైజర్ సెక్రటరి కుప్పాల వెంకటసుబ్బయ్య మృతుడి కుటుంబానికి ప్రగాడ సానుభూతి తెలిపారు. ఆ కుటుంబాన్ని ఆదుకుంటామన్నారు.

కళ్లద్దాల పంపిణీ

పుల్లంపేట, మార్చి 15 (ఆంధ్రజ్యోతి) : స్థానిక ఎస్‌బీవీడీ సభ హైస్కూల్లో శనివారం ముక్కా రూపానందరెడ్డి ట్రస్టు ఆధ్వర్యంలో కంటి అద్దాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వచ్చిన రోగులకు భోజన వసతి ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల ఉపాధ్యక్షుడు చంద్రశేఖర్‌నాయుడు, సింగం ఆనిరాయణరెడ్డి, సింగమాల విశ్వనాథ్‌రెడ్డి పాల్గొన్నారు.

వైభవంగా సీతారాముల కల్యాణం



కల్యాణం కోసం పట్టువస్త్రాలు తెస్తున్న ఉభయదారులు

నందలూరు, మార్చి 15 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని నాగిరెడ్డిపల్లె మేజర్ గ్రామ పంచాయతీ పరిధిలో గల గొల్లపల్లెలో నిర్మించిన రామాలయంలో శనివారం ఉదయం సీతారాముల కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. వేదపండితులు బండాత్మకూరు శివకుమార్‌శర్మ ఆధ్వర్యంలో ఈ కల్యాణ జరిగింది. దివంగత భారతాల సుబ్బరాయుడు జ్ఞాపకార్థం ఆయన సతీమణి అమ్మనమ్మ కుమారులు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. గణపతి, సీతారామ లక్ష్మణ, ఆంజనేయస్వామి, శ్రీకృష్ణ విగ్రహాలతోపాటు ధ్వజస్తంభ ప్రతిష్ఠను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి మేడా విజయశేఖర్‌రెడ్డి, ఆర్టీసీ రీజనల్ మాజీ చైర్మన్ యెద్దల సుబ్బరాయుడులు పూజలు చేశారు. మాజీ ఎంపీపీ పల్లె సుబ్రమణ్యం, సర్పంచ్ జంబు సూర్యనారాయణ, మాజీ సర్పంచ్ భూమన శివశంకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శివయ్య భక్తులకు అన్నదానం అభినందనీయం

సిద్దవటం, మార్చి 15 (ఆంధ్రజ్యోతి) : గత మహాశివరాత్రి ఉత్సవాల్లో భాగంగా భక్తులకు అన్నదానం సమకూర్చడానికి తెలుగుదేశం పార్టీ సీనియర్ నేత, పంచాయతీరాజ్ రాష్ట్ర కమిటీ ఆర్గనైజింగ్ సెక్రటరి కుప్పాల వెంకటసుబ్బయ్య సేవలు అభినందనీయమని జ్యోతి సిద్దేశ్వర అన్నదాన ట్రస్టు కమిటీ సభ్యులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా అన్నదాన ట్రస్టు కమిటీ సభ్యుడు జింక శివ శనివారం మాట్లాడుతూ రాబోవు రోజుల్లో మరెన్నో సేవా కార్యక్రమాలు చేయాలని కోరారు.కుప్పాల వెంకటసుబ్బయ్య మాట్లాడుతూ అన్నప్రసాదం అందించడం వరంలాంటిదని, ఈ కార్యక్రమంలో తనను భాగస్వామ్యం చేయడం సంతోషమన్నారు.

పారిశుధ్యం.. ప్రజలందరి బాధ్యత

● జిల్లా ప్రత్యేక అధికారి వాడరేవు వినయ్‌చంద్

రాయచోటిటౌన్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): పారిశుధ్య నిర్వహణ బాధ్యత మున్సిపల్ కార్మికులు, పంచాయతీ కార్మికులది మాత్రమే కాదని, ఇది ప్రతి ఒక్కరి బాధ్యత అని జిల్లా ప్రత్యేక అధికారి వాడరేవు వినయ్‌చంద్ సూచించారు. శనివారం ఆయన పట్టణంలో స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమంలో పాల్గొన్నారు. ముందుగా పట్టణంలోని భద్ర కాళీ సమేత వీరభద్రస్వామిని దర్శించుకున్నారు. అర్చకులు పూర్ణ కుంభంతో స్వాగతం పలికారు. దర్శనం అనంతరం ఆలయ మండపంలో అర్చకులు తీర్థప్రసాదాలు అందించి వేదాశీర్వచనం చేశారు. అనంతరం ఆయన డైట్ ఉన్నత పాఠశాలలో స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమంలో పాల్గొన్నారు. ఇప్పటి నుంచే విద్యార్థులు పరిశుభ్రతను అలవాటుగా చేసుకోవాలని ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం ఆర్టీసీ బస్సు కూడలి వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు ప్రారంభించిన ఈ కార్యక్రమం అన్ని ప్రాంతాల్లోనూ ప్రతి నెల మూడవ శనివారం ఘనంగా నిర్వహిస్తున్నామని, ఈ కార్యక్రమంలో అందరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. పారిశుధ్య నిర్వహణ బాధ్యత మున్సిపల్ కార్మికులు,



విద్యార్థులు, ఉపాధ్యాయులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న జిల్లా ప్రత్యేక అధికారి వినయ్‌చంద్

పంచాయతీ కార్మికులది మాత్రమే కాదని, ఇది ప్రతి ఒక్కరి బాధ్యత అని ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్, మున్సిపల్ కమిషనర్ వాసుబాబు, ఆలయ ఈవో విశ్వనాథ్, మున్సిపల్ అధికారులు, జిల్లా అధికారులు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

మిద్దెపై నుంచి కింద పడి ఒకరి మృతి



రాజేశ్‌యాదవ్ మృతదేహం

రామాపురం, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): మద్యం మత్తులో మిద్దెపై నుంచి పడి ఓ వ్యక్తి మృతి చెందాడు. ఎస్ఐ వెంకట సుధాకర్‌రెడ్డి కథనం మేరకు ఉత్తరప్రదేశ్‌లోని వారణాసికి చెందిన రాజేశ్ యాదవ్(40) మండలంలోని కసిరెడ్డిగారిపల్లె పంచాయతీ కొత్త రోడ్డు నారాయణపురం సమీపంలోని వినాయక స్టోన్ క్రషర్‌లో పనిచేస్తూ, కొత్తరోడ్డు నారాయణపురంలో నివాసముంటున్నాడు. హోలీ సందర్భంగా శుక్రవారం రాత్రి తన సహచరులతో కలిసి అతిగా మద్యం సేవించి, మిద్దెపై నిద్రించాడు. అర్ధరాత్రి సమయంలో మిద్దెపై నుంచి పడి మృతి చెందాడు. రామాపురం పోలీసులు. సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని రాయచోటి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

పేకాట రాయుళ్ల అరెస్ట్.. నగదు స్వాధీనం



పోలీసులకు పట్టుబడ్డ పేకాట రాయుళ్లు

నిమ్మనపల్లి, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): పేకాట ఆడుతున్న నలుగురిని అదుపులోకి తీసుకుని, నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ ఐ తిప్పేస్వామి తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ మండలంలోని సామకోటవారిపల్లి పంచాయతీలోని ఓ చింతచెట్టు కింద అదే గ్రామానికి చెందిన నలుగురు పేకాట ఆడుతుండగా దాడులు నిర్వహించి రూ.3420 స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురికి గాయాలు

మదనపల్లె అర్బన్, మార్చి 15(ఆంధ్రజ్యోతి):వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురు గాయపడి శనివారం మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి వచ్చారు. కురబలకోట మండలం గొర్లవారిపల్లెకు చెందిన నాగమల్‌రెడ్డి (55), ఆదినారాయణ బైక్‌పై సీటీఎంకు వస్తుండగా మిట్టపల్లె వద్ద ఆటో ఢీ కొంది ఈ సంఘటనలో ఇద్దరూ గాయపడ్డారు. మదనపల్లెలో టైలర్ షాపు నిర్వహిస్తున్న మధుకర్‌రెడ్డి (40) మధ్యాహ్నం ఇసుకనూతినపల్లె దారిలో వెళుతూ ఎదురుగా వస్తున్న బైక్‌ను ఢీకొన్నాడు. దీంతో గాయపడిన అతనిని మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

పాతకక్షలతో మహిళపై దాడి



గంగరాణి ఇంటిలో ధ్వంసమైన టీవీ, ఫ్యాన్ తదితరాలు

గుర్రంకొండ, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): పాతకక్షల కారణంగా దాడి చేసి గాయపరిచారంటూ ఓ మహిళ శనివారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. సరిమడుగు పంచాయతీ కృష్ణాపురానికి చెందిన వాసాల రఘు, గంగరాణి దంపతులకు అదే గ్రామానికి చెందిన మల్లేశ్వరి కుటుంబానికి పాత కక్షలున్నాయి. ఈ నేపథ్యంలో శనివారం మల్లేశ్వరి, ఆమె కుమారుడు సంతోష్ మరో పది మంది యువకులతో ఇంట్లోకి దూరి తనపై దాడి చేయడంతోపాటు ఇంట్లో ఉన్న టీవీ, ఫ్యాన్, బ్యాటరీ పంప్‌ను ధ్వంసం చేసి. చంపేస్తామంటూ బెదిరించినట్లు గంగరాణి ఫిర్యాదులో పేర్కొన్నారు.

ఆత్మహత్య కేసులో ముగ్గురు అరెస్టు

మదనపల్లె అర్బన్, మార్చి 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని సిద్దమ్మగారిపల్లెకు చెందిన గిరిబాబు గత నెల 20న ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న విషయం తెలిసిందే. మృతుని తల్లి ఫిర్యాదు మేరకు ఈ కేసులో నిందితులుగా భావిస్తున్న అదే గ్రామానికి చెందిన అనిల్, శివ, అరుణను శనివారం దేవతా నగర్ సమీపంలో శనివారం సాయంత్రం అదుపులోకి తీసుకుని, రిమాండ్‌కు తరలించినట్లు తాలుకా సీఐ కళా వెంకటరమణ తెలిపారు.

ఆదర్శ ఉద్యోగులకు నగదు ప్రోత్సాహకాలు

మదనపల్లె అర్బన్, మార్చి 15(ఆంధ్రజ్యోతి):మదనపల్లె ఆర్టీసీ వన్ డిపోలో శనివారం ఆదర్శ ఉద్యోగుల అభినందన సభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆ డిపో మేనేజరు మూరే వెంకటరమణారెడ్డి మాట్లాడుతూ డిపో పరిధిలో అత్యధికంగా కేఎంపీఎల్, ఈపీకే, అధికంగా ఆధాయం తెచ్చిన ఉద్యోగులకు నగదు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజరు రేవతి, రవి, తదితరులు పాల్గొన్నారు.



కల్యాణం నిర్వహిస్తున్న వేద పండితులు





పట్టువస్త్రాలు సమర్పిస్తున్న చంద్రబాబు దంపతులు, బీఆర్ నాయుడు

అమరావతిలో.. శ్రీవారి కల్యాణోత్సవం

రాజధాని అమరావతి వెంకటపాలెంలోని శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో ప్రప్రథమంగా శనివారం శ్రీవారి కల్యాణోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో వేదమంత్రోచ్చరణల మధ్య అఖిలాండ కోటి బ్రహ్మాండనాయకుడి కల్యాణాన్ని తిలకించిన భక్తజన సందోహం పరవశించింది. విద్యుత్ వెలుగులతో కల్యాణ ప్రాంగణం కాంతులీనగా భక్తుల జయజయధ్వానాల మధ్య కన్నుల పండువగా జరిగింది. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు దంపతులు, గవర్నర్ అబ్దుల్ నజీర్ తదితరుల సమక్షంలో టీటీడీ వేద పండితులు స్వామివారి కల్యాణాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. భక్తులను భాగస్వాములను చేస్తూ కైంకర్యాలను నిర్వహించారు.

-తుళ్లూరు, ఆంధ్రజ్యోతి



వెంకటపాలెంలోని వేంకటేశ్వరస్వామి కల్యాణ మహోత్సవంలో పాల్గొన్న గవర్నర్ అబ్దుల్‌నజీర్, సీఎం చంద్రబాబు దంపతులు, మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు తదితరులు



శ్రీవారికి పట్టువస్త్రాలు తీసుకెళుతున్న సీఎం చంద్రబాబు దంపతులు



గవర్నర్ అబ్దుల్ నజీర్‌కు లడ్డూ ప్రసాదం అందజేస్తున్న టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు



చంద్రబాబుకు లడ్డూ ప్రసాదం అందజేస్తున్న బీఆర్ నాయుడు



సీఎం చంద్రబాబుకు వేంకటేశ్వరస్వామి జ్ఞాపికను అందజేస్తున్న టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు, ఈవో శ్యామలరావు

టీడీపీ నేత హత్య దారుణం

● పోలీసుల నిర్లక్ష్యమే కారణం ● ఎమ్మెల్యే అమరనాథరెడ్డి

మదనపల్లె అర్బన్, మార్చి 15(ఆంధ్రజ్యోతి): పుంగనూరు మండలం, చంద్రమాకులపల్లె గ్రామం కృష్ణాపురానికి చెందిన టీడీపీ నేత రామకృష్ణ హత్య చాలా దారుణమని మాజీ మంత్రి, పలమనేరు ఎమ్మెల్యే అమరనాథరెడ్డి అన్నారు. పోలీసుల నిర్లక్ష్యం వల్లే ఈ హత్య జరిగిందన్నారు.
చిత్తూరు జిల్లా పుంగనూరు మండలం కృష్ణాపురంలో శనివారం ఉదయం చిల్లర అంగడి వద్ద కె.రామకృష్ణ కుమారుడు సురేశ్‌కుమార్ కూర్చుని ఉండగా.. అక్కడికి మాజీ వలంటీర్, వైసీపీ కార్యకర్త కె.వెంకటరమణ బైక్‌పై వచ్చి సంచిలో తెచ్చుకున్న కొడవలితో హత్య చేయడానికి ప్రయత్నించాడు. ఈ సంఘటనలో సురేశ్‌కుమార్ చేతికి గాయమైంది. అతను కేకలు వేస్తూ పరుగులు తీస్తుండగా అటుగా వెళుతున్న ద్విచక్రవాహనదారులు కాపాడారు. కొడుకును తరుముతున్నట్లు తెలుసుకున్న సురేశ్‌కుమార్ తండ్రి రామకృష్ణ పొలం దగ్గర నుంచి రాగా అతనిపై వెంకటరమణ కొడవలితో దాడిచేసి పారిపోయాడు. క్షతగాత్రులను వెంటనే మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఇక్కడ డాక్టర్లు సురేష్‌కుమార్‌కు చికిత్స చేశారు. రామకృష్ణను మెరుగైన వైద్యం కోసం తిరుపతికి తరలిస్తుండగా మృతిచెందాడు. మృతదేహాన్ని మదనపల్లె మార్చురీలో ఉంచారు.
మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో ఉన్న రామకృష్ణ మృతదేహాన్ని అమరనాథరెడ్డి సందర్శించి వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కక్షపూరిత రాజకీయాల్లో భాగంగానే కృష్ణాపురం గ్రామానికి చెందిన వైసీపీ నాయకుడు వెంకటరమణ కొడవలితో దాడి చేసి రామకృష్ణ, అతని కుమారుడు సురేశ్‌ను గాయపర్చాడన్నారు. పోలీసుల నిర్లక్ష్యంతో ఈ రోజు నిండుప్రాణం పోయిందన్నారు. పోలీసు శాఖను ప్రభుత్వం ప్రక్షాళన చేయాలన్నారు. ఈయన వెంట పుంగనూరు ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డి, మాజీ ఎమ్మెల్యే దొమ్మలపాటి రమేశ్ ఉన్నారు. సాయంత్రం పూతలపట్టు ఎమ్మెల్యే మురళి మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి విచ్చేసి రామకృష్ణ మృతదేహాన్ని సందర్శించారు. కాగా.. మదనపల్లె జిల్లా ఆస్పత్రిలో రామకృష్ణ మృతదేహాన్ని తెలుగు యువత రాష్ట్ర అధ్యక్షుడు శ్రీరాం చినబాబు, దొరస్వామినాయుడు సందర్శించారు. మృతుడి భార్య ఉమాదేవిని, కుమారులు సురేష్‌కుమార్, శివ కుటుంబసభ్యులను వారు పరామర్శించారు. హోం మంత్రితో బాధిత కుటుంబీకులను ఫోన్లో మాట్లాడించారు.

న్యాయం చేస్తామన్న హోంమంత్రి

గాయపడిన సురేశ్‌కుమార్ హోంమంత్రితో ఫోన్‌లో మాట్లాడుతూ గ్రామంలో మొదట వైసీపీని ఎదిరించి టీడీపీ జెండా కట్టింది మా నాన్న అని, గతంలో టీడీపీ గెలిచిన సందర్భంగా కేక్‌కట్ చేస్తుంటే బైక్‌పై వచ్చి మా అమ్మ రెండు కాళ్లు విరగగొట్టారని వివరించారు. తరువాత చంద్రబాబు నాయుడు బర్త్‌డే కార్యక్రమం చేస్తుంటే తన అన్న శివ చెయ్యి విరగ్గొట్టారని, ఇప్పుడు ఏకంగా కొడవలితో దాడి చేసి తన చేతికి గాయం చేశాడని, అడ్డు వచ్చిన మానాన్నను నరికి చంపేశాడని తెలిపారు. గతంలో జరిగిన సంఘటనలపై పుంగనూరు స్టేషన్‌లో కేసులు ఉన్నాయని, ఏ కేసులో కూడా తమకు న్యాయం జరగలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పుడైనా న్యాయం చేయాలని వేడుకున్నారు. పార్టీ కోసం పాటుపడుతున్న వారికి న్యాయం చేయలేకపోతే సామాన్య ప్రజల పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. హోం మంత్రి వారిని పరామర్శించి న్యాయం చేస్తామని భరోసా ఇచ్చారు. ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందన్నారు.



మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో మీడియాతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అమరనాథ్‌రెడ్డి



రామకృష్ణ మృతదేహాన్ని పరిశీలిస్తున్న తెలుగు యువత రాష్ట్ర అధ్యక్షుడు శ్రీరాం చినబాబు

ఊట చెరువు టీసీ సభ్యుల సస్పెన్షన్

సుండుపల్లె, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తిమ్మసముద్రం గ్రామంలో గతంలో జరిగిన ఊట చెరువు ఎన్నికపై విచారణకు కలెక్టర్ చామకూరి శ్రీధర్ కమిటీని నియమించిన సంగతి తెలిసిందే. సదరు ఘటనపై పూర్తి విచారణ చేసిన కమిటీ నాలుగు, ఐదో నంబర్ టీసీ ఎన్నికల్లో అక్రమాలు జరిగినట్లు నిర్ధారించింది. దీంతో ఆయా టీసీల బాధ్యులు అబ్దుల్ తవాబ్, ఖలీలుల్లాలను సస్పెండ్ చేస్తూ శనివారం కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. హైకోర్టు ఉత్తర్వు ప్రకారం ఊట చెరువు అధ్యక్షుడిగా ఎన్నికైన లగిశెట్టి రామాంజులు టీసీ మూడుగా కొనసాగుతారని ఉత్తర్వుల్లో తెలియజేశారు. అప్రజాస్వామికంగా ఎన్నికైన టీసీ సభ్యులను సస్పెండ్ చేసినందుకు ఫిర్యాదుదారు టీసీ-2 సభ్యుడు మోహన్‌నాయుడు కలెక్టర్‌కు ధన్యవాదాలు తెలిపారు. ఈ చర్యతోకూటమి ప్రభుత్వంలో అక్రమాలకు చోటు ఉండదు అని నిరూపితమైందని, ఈ విషయంపై స్పందించిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నారా లోకేశ్, ఇరిగేషన్‌శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు ఇరిగేషన్ కమిషనర్ అన్నమయ్య జిల్లా కలెక్టర్, జిల్లా ఇరిగేషన్‌శాఖ అధికారులు ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు తెలిపారు.

మల్లూరమ్మ ఆలయ హుండీ లెక్కింపు

చిన్నమండెం, మార్చి15(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్తపల్లి పంచాయతీలో గురు, శుక్రవారాల్లో నిర్వహించిన మల్లూరమ్మ జాతర సందర్భంగా భక్తులు హుండీలో సమర్పించిన కానుకలను శనివారం లెక్కించారు. దేవదాయశాఖ, పోలీసు, రెవెన్యూ సిబ్బందితోపాటు ఆలయ కమిటీ సభ్యులు ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా దాదాపు 2,93,890 రూపాయలు ఆదాయం వచ్చిందని ఈవో కొండారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు.



హుండీలోని కానుకలు లెక్కిస్తున్న అధికారులు, సిబ్బంది

పేదవాడి హలీం.. గంజి!

» రమజాన్ మాసం ప్రత్యేకం

» ప్రతి మసీదులోనూ ఉచితంగా పంపిణీ ..

పీలేరు, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): ఇస్లాంలో రమజాన్ ప్రత్యేకమైనది. ఈ నెలలో చేసే ప్రార్థనలు, నమాజులు, దానధర్మాలకు ఎంతో ప్రత్యేకత ఉంటుంది. ధార్మికమైన అంశాలలోనే కాకుండా ఆహార అలవాట్లలో కూడా రమజాన్ మాసం ప్రత్యేకత చాటుకుంటుది. రోజంతా కఠోర ఉపవాసం ఉండే ముస్లింలు సాయంత్రం ఇఫ్తార్ సమయంలో బలవర్ధకమైన భోజనం కావాలని కోరుకుంటారు. ఖర్జూరంతోపాటు, పలు రకాల ఫలాలు తీసుకుంటూ ఉంటారు. వీటితోపాటు తెలంగాణ ప్రాంతంలో హలీమ్, కోసాంధ్ర ప్రాంతంలో గంజి ఎక్కువగా స్వీకరిస్తారు. హలీమ్ మాంసాహారం కావడంతో దాని తయారీం, వినియోగం అందరికీ సాధ్యపడదు. ఇక గంజి .. తక్కువ ఖర్చుతో, సులువుగా తయారు చేసుకునే అవకాశం ఉండడంతో, అందరూ దీని వైపు మళ్లుతున్నారు. రెండు దశాబ్దాల క్రితం గృహస్థులు గంజిని తయారు చేసి మసీదుకు వితరణ చేసేవారు. కాలక్రమంలో మసీదు కమిటీ సభ్యులే దానిని తయారు చేసి తమ మసీదు పరిధిలోని వారికి ఉచితంగా పంపిణీ చేస్తున్నారు.

తయారీ ఇలా..

బియ్యం రవ్వ లేదా, బొంబాయి రవ్వతో గంజిని తయారు చేస్తున్నారు. పీలేరు ప్రాంతంలోని అత్యధిక మసీదుల్లో బొంబాయి రవ్వతో తయారు చేసిన గంజిని పంపిణీ చేస్తున్నారు. బొంబాయి రవ్వ, పచ్చిమిర్చి, అల్లం, వెల్లుల్లి, టమోటాలు, కొత్తిమీర, పుదీనా, యాలకులు, దాల్చిన చెక్క, లవంగాలు, నెయ్యి, కొన్ని చోట్ల వేరుశెనగ గింజలను వాడుతుంటారు. రమజాన్ మాసం ప్రారంభమైన నాటి నుంచి మసీదు కమిటీ సభ్యులు గంజి తయారీకి ఎటువంటి ఆటంకం కలుగకుండా చర్యలు తీసుకుంటున్నారు. ఇలా తయారు చేసిన గంజిని కుల, మతాలకు అతీతంగా ఇష్టపడుతుంటారు. క్యూలలో నిలబడి మరీ ఇళ్లకు తీసుకెళుతుంటారు.



గంజి పంపిణీ చేస్తున్న మసీదు కమిటీ సభ్యులు

రమజాన్ మాసంలో అతి ముఖ్యమైన ఆరాధన ఉపవాసం. రాయలసీమ, కోస్తాంధ్ర ప్రాంతాల్లో గంజిని ఆహారంగా తీసుకుని ఉపవాసం విరమిస్తుంటారు. చాలా ప్రాంతాల్లో ఇఫ్తార్ సమయంలో పండ్లు, అల్పాహారం లేకపోయినా చిన్నా, పెద్ద తేడా లేకుండా అందరూ ఒక గిన్నె గంజి తప్పకుండా తాగుతారు.

ఆరోగ్య ప్రయోజనాలు

- ఉపవాసం కారణంగా సుమారు 14 గంటలు ఆహారానికి దూరంగా ఉన్న శరీరానికి తక్షణ శక్తి లభిస్తుంది.
- వేడెక్కిన శరీరాన్ని చల్లబరుస్తుంది.
- గంజిలో విటమిన్లు, ఖనిజాలు, యాంటి ఆక్సిడెంట్లు ఉంటాయి. ఇవి శరీరానికి అవసరమైన పోషకాలు అందిస్తాయి.
- ఫైబర్ అధికంగా ఉన్న కారణంగా జీర్ణక్రియ మెరుగుపడుతుంది.
- కేలరీలు తక్కువగా ఉంటాయి కాబట్టి బరువు తగ్గించడంలో సహాయపడుతుంది.
- కార్బోహైడ్రేట్లు అధికంగా ఉండడం వల్ల రక్తంలో చక్కెర స్థాయిలను క్రమంగా పెంచుతుంది.



పీలేరు అక్సా మసీదులో గంజి తయారీ కోసం కూరగాయలు కోస్తున్న కమిటీ సభ్యులు

ఏప్రిల్‌లో రెండో దశ పశువైద్య శిబిరాలు

● పశుసంవర్ధక శాఖ జేడీ గుణశేఖర్ పిళ్లై

తంబళ్లపల్లె, మార్చి 15(ఆంధ్రజ్యోతి): వేసవిలో పశువులు జబ్బుల బారిన పడకుండా గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయించాలని జిల్లా పశుసంవర్ధక శాఖ సంయుక్త సంచాలకుడు గుణశేఖర్ పిళ్లై సూచించారు. శనివారం స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ దివస్ కార్యక్రమం సందర్భంగా మండలానికి వచ్చిన ఆయన స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. జాతీయ పశువ్యాధి నివారణ పథకం కింద మార్చి 31 వరకు జిల్లా వ్యాప్తంగా సుమారు 3,33,300 గాలి కుంటు టీకాలను వేయనున్నట్లు తెలిపారు. ప్రతి మండలంలో పశువైద్య సిబ్బంది బృందాలుగా ఏర్పడి ఉదయమే ఇంటింటికీ వెళ్లి మూడు నెలలు వయసు పైబడ్డ పశువులన్నింటికీ ఉచితంగా టీకాలు వేస్తారన్నారు. గాలికుంటు టీకా పంపిణీలో రాష్ట్రంలో అన్నమయ్య జిల్లా ద్వితీయ స్థానంలో ఉన్నట్లు వివరించారు. పెయ్యదూడలకు బ్రుసెల్లోసిస్ టీకాలు వేస్తున్నట్లు తెలిపారు. ఈ టీకాలు జిల్లాకు 15,000 డోసులు వచ్చాయని.. 4 నుంచి 8 మాసాలలోపు పెయ్య దూడలకు వీటిని వేయనున్నట్లు తెలిపారు. ఇప్పటి దాకా జిల్లాలో 10వేల టీకాలను వేశామని, ఈ నెల చివరకు మిగిలిన టీకాలు పూర్తి చేస్తామని తెలిపారు. వేసవిలో పశుగ్రాస కొరతను అధిగమించేందుకు గత 2024-25లో నీటి ఎద్దడి తట్టుకుని అధిక గ్రాసాన్నిచ్చే 175 టన్నుల గడ్డి విత్తనాలను 75 శాతం రాయితీతో పంపిణీ చేసినట్లు తెలిపారు. సాగు నీటి సౌకర్యం ఉన్న రైతులు ఈ విత్తనాలు పొంది పశుగ్రాసాన్ని నిల్వ చేసుకున్నట్లు వివరించారు. ఉపాధి హామీ పథకం ద్వారా ఒక్కో రైతు 10 సెంట్ల నుంచి 50 సెంట్లలో బహువార్షిక గడ్డి పెంపకానికి వంద శాతం రాయితీ ఇస్తున్నట్లు తెలిపారు. తంబళ్లపల్లె నియోజకవర్గంలో దాదాపు 500 ఎకరాలలో గడ్డి సాగుకు ప్రోత్సహించినట్లు తెలిపారు. జనవరిలో నిర్వహించిన పశువైద్య శిబిరాలలో కొన్ని లక్షల పశువులకు వ్యాధి నివారణ టీకాలు వేసినట్లు తెలిపారు. ఈ శిబిరాలకు పాడి రైతుల నుంచి విశేష స్పందన రావడంతో ఏప్రిల్‌లో రెండో విడత నిర్వహించేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నామన్నారు. ఎంపీడీవో ఉపేంద్రరెడ్డి, ఎంఈవో త్యాగరాజు తదితరులు ఉన్నారు.



మాట్లాడుతున్న జేడీఏహెచ్ గుణశేఖర్ పిళ్లై

పశువైద్య సేవలకు ఆటంకం

● జిల్లాలో నిలిచిన సంచార వాహనాలు ● పాడి రైతుల అవస్థలు ● రోడ్డున పడ్డ సిబ్బంది

ప్రొద్దుటూరు రూరల్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): పశువులకు అత్యవసర వైద్యసేవలు అందించేందుకు గత ప్రభుత్వం సంచార పశు ఆరోగ్య సేవా వాహనాలను అందుబాటులోకి తెచ్చింది. పశువులకు ప్రమాదాలు జరిగినప్పుడు, రోగాల బారిన పడినప్పుడు దూర ప్రాంతాల్లోని వైద్యశాలలకు తీసుకెళ్లాలంటే పోషకులు వ్యయప్రయాసలు పడేవారు. ఒక్కోసారి లక్షలు విలువచేసే పశువులు మృత్యువాత పడుతుండటంతో రైతులు ఆర్థికంగా నష్టపోతున్నారు. ఈ నేపథ్యంలో మూగజీవాల మరణాల రేటును తగ్గించేందుకు సంచార వాహనాలను ఏర్పాటు చేశారు. 2022 మే నెలలో తొలివిడత ప్రతి నియోజకవర్గానికి ఒకటి చొప్పున జిల్లాకు ఏడు వాహనాలు కేటాయించారు. ప్రస్తుతం జీవీకే సంస్థతో ఒప్పందం ముగిసిపోవడంతో వాటి సేవలు తాత్కాలికంగా నిలిచిపోయాయి. మొదటి విడతలో ప్రొద్దుటూరు, జమ్మలమడుగు, కమలాపురం, మైదుకూరు, కడప, బద్వేలు, పులివెందుల నియోజకవర్గ ప్రాంతాల్లో వాహనాలు ఎక్కడికక్కడే ఆగిపోయాయి. దీంతో గ్రామాల్లోని పశుపోషకులు జీవాలకు ఏవైనా వ్యాధులు సోకితే చికిత్సలు చేయించేందుకు ఇబ్బందులు పడుతున్నారు.

పాడి రైతుల అవస్థలు

20వ పశుగణన సర్వే ప్రకారం జిల్లాలో గేదెలు 3,99,754, ఎద్దులు, ఆవులు 44 వేలు, గొర్రెలు 9,20,614, మేకలు 3,80,099 ఉండగా.. జిల్లాలో 1.80 లక్షల మంది ప్రత్యక్ష పాడి రైతులు ఉన్నారు. ఈ నేపథ్యంలో పశువుల సంరక్షణ కోసం 20 రకాల మల సంబంధిత పరీక్షలు, 15 రకాల రక్త పరీక్షలు చేసే వీలుగా మైక్రోస్కోప్‌తోపాటు ఆటోగ్లేవ్ ప్రయోగశాలను సంచార వాహనంలో ఏర్పాటు చేశారు. హైడ్రాలిక్ సౌకర్యంతో పశువులను వెంటనే వాహనంలోకి ఎక్కించి చికిత్స అందించేందుకు వీలుండేది. ఇంకా అత్యవసర పరిస్థితి అయితే అందులోనే వైద్యశాలలకు తరలించి చికిత్స అందించేవారు. వాహనంలో పశువైద్యుడితోపాటు పారావేట్, డ్రైవర్‌కం అటెండర్ ఉండేవారు. ఆవులు, గేదెలు, గొర్రెలు, మేకలు తీవ్ర అనారోగ్యానికి గురైనపుడు అత్యవసర వైద్యసేవలు అందించేందుకు పశుపోషకులు టోల్‌ఫ్రీ నెంబరు 1962కు ఫోన్‌చేస్తే ఆయా గ్రామాలకు వెళ్లి వైద్యసేవలు అందించే వారు. అత్యవసర వైద్యం చేయాల్సివస్తే వైద్య నిపుణులు స్థానిక సిబ్బందితో కలిసి వాహనంతో ఘటనా స్థలానికి చేరుకుని శస్త్ర చికిత్సలు చేసేవారు. వాహనాలు ఆగిపోవడంతో పశువులకు ఏవైనా అత్యవసర వైద్యం చేయాల్సి వస్తే ఇబ్బందిగా మారిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

గడువు ముగియడంతో నిలిచిపోయాయి..

తొలి విడత వాహనాలు ఒప్పందం ముగియడంతో జిల్లాలోని ఏడు నియోజకవర్గాల్లో వాహనాలు నిలిచిపోయాయి. రెండవ విడత వచ్చిన వాహనాలతో వైద్య సేవలు అందిస్తున్నాం. పశువైద్య సేవలకు ఆటంకం లేకుండా చూస్తున్నాం.

- సి.శారదమ్మ, పశుసంవర్ధకశాఖ జేడీ



నిలిచిన సంచార పశుఆరోగ్య సేవా వాహనం

ఫిబ్రవరి 15 నుంచి..

జీవీకే సంస్థతో ఒప్పందం ముగియడంతో మొదటి విడతలో జిల్లాకు కేటాయించిన వాహనాలు ఫిబ్రవరి 15 నుంచి ఆగిపోయాయి. ఇందులో పనిచేసే సిబ్బంది ఉద్యోగాలు కోల్పోయి రోడ్డున పడ్డారు. వీరంతా తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని పశుసంవర్ధకశాఖ జాయింట్ డైరెక్టర్ శారదమ్మను కలిసి సిబ్బంది వినతి పత్రం అందించారు. ప్రభుత్వం ఏ సంస్థతో ఒప్పందం కుదుర్చుకున్నా తమను తిరిగి విధుల్లో కొనసాగించాలని కోరుతున్నారు.



పశుసంవర్ధకశాఖ జేడీ శారదమ్మకు వినతి పత్రం అందిస్తున్న సంచార వాహన సిబ్బంది

'వితరణ చేసే అవకాశం కలగడం కూడా అదృష్టమే'



కలికిరి జామియా మసీదు అభివృద్ధి కోసం నగదు వితరణ చేస్తున్న దినకర్

కలికిరి, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): దేవాలయం, మసీదు, చర్చి ఏదైనా సరే వాటి కోసం వితరణ చేసే అవకాశం కలగడం కూడా ఒక అదృష్టమేనని సాఫ్ట్‌వేర్ ఇంజనీరు, టీడీపీ నేత సిబ్బాల దినకర్ పేర్కొన్నారు. రంజాన్ మాసం సందర్భంగా ఆయన పంచాయతీలోని తొమ్మిది మసీదుల అభివృద్ధికి నగదు అందించారు. అండేకురవపల్లె వాసి సిబ్బాల దినకర్ బెంగుళూరులో సాఫ్ట్‌వేర్ ఉద్యోగి. పంచాయతీలోని అన్ని మసీదుల కోసం రంజాన్ వితరణకు సంకల్పించారు. పట్టణంలోని జామియా (పెద్ద) మసీదులో మత పెద్దలకు శనివారం రూ.20 వేలు అందజేశారు. క్రాస్ రోడ్డులోని ఈద్గా మసీదుకు రూ.20 వేలు, పంచాయతీలోని ఏఎస్‌ఆర్ కాలనీ, రెడ్డివారిపల్లె, చెరువుముందరపల్లె, టెలిఫోన్ ఎక్స్చేంజ్, బీడీ కాలనీ, ఇందిరమ్మ కాలనీ, సత్యాపురం మసీదుల కోసం రూ.10 వేల వంతున అందజేశారు. శనివారం జరిగిన కార్యక్రమాల్లో మాజీ ఎంపీపీ, మాజీ జడ్పీటీసీ, జామియా మసీదు ముతవల్లీ పాలగిరి రహంతుల్లా, మండల టీడీపీ అధ్యక్షుడు నిజాముద్దీన్, ఖజా సాహెబ్, లేపాక్షి అస్లామ్, షాహార్, కాదర్‌వల్లి, శబరి తదితరులు పాల్గొన్నారు.

కనుమలో గంగమ్మతిరునాళ్లు ప్రారంభం

మదనపల్లె అర్బన్, మార్చి 15(ఆంధ్రజ్యోతి): బసినికొండ గ్రామంలో పుంగనూరు బైపాస్‌రోడ్డులో వెలసిన కనుమలో గంగమ్మ ఆలయంలో శనివారం ఉదయం నుంచి తిరునాళ్లు ప్రారంభమైనట్లు ఆలయ ఈఓ రమణ తెలిపారు. రాత్రికి ఆలయంలో రాత్రి తిరునాళ్లు వైభవంగా నిర్వహించారు. ఉదయాన్నే గంగమ్మకు ప్రత్యేకంగా అలంకరణలు, అర్చనలు, విశేష పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. రాత్రి మేళతాళాలతో, చెక్కభజనలతో మంగళవాయిద్యాలతో చాందినీ బండ్లు కట్టి తిరునాళ్లను ఘనంగా నిర్వహించారు. ఆలయంలో భక్తుల రద్దీని అనుగుణంగా బారికేడ్లు ఏర్పాటు చేశారు. కార్యక్రమాలను సీతక యుగంధర్, మండి వెంకటరమణ, గురుమూర్తి, కార్తీక్, మురహరి, విక్రమ్, ప్రసాద్ తదితరులు పర్యవేక్షించారు.



ప్రొద్దుటూరులో భారీ చోరీ

● 25 తులాల బంగారు ఆభరణాల అపహరణ

ప్రొద్దుటూరు, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): హౌసింగ్ బోర్డు కాలనీలో శనివారం తెల్లవారుజామున చోరీ జరిగింది. ఇంట్లో వారు నిద్రలో ఉండగా దొంగలు దర్జాగా ఇంట్లోకి వచ్చి బీరువా తాళాలు తీసి 25 తులాల బంగారు ఆభరణాలు దోపిడీ చేశారు. ఆ వివరాల్లోకి వెళితే.. రాజుపాళెం మండలం టంగుటూరు వాసి గోపిరెడ్డి శివశంకర్‌రెడ్డి తన కుమార్తె చదువుల కోసం హౌసింగ్ బోర్డు కాలనీలో నివాసముంటున్నాడు. శనివారం రాత్రి భోజనాల తర్వాత భార్య, కూతురుతో పాటు శివశంకర్‌రెడ్డి మేడపైన బెడ్ రూములో నిద్రపోయారు. కింద ఫ్లోర్‌లో రెండు బెడ్ రూములు, మేడమీద రెండు బెడ్ రూములున్నాయి. ఒక బెడ్ రూములో తామంతా పడుకుని ఉండగా మరో బెడ్ రూముకు కేవలం గడియ పెట్టారు. తెల్లవారుజామున దొంగలు కింది ఫ్లోర్‌నుంచి కిచెన్ రూము తలుపులు తీసి ఇంట్లోకి జొరబడి నేరుగా పైఫ్లోర్‌కు వచ్చారు. నిద్రిస్తున్న వారు బయటికి రాకుండా ఆ గదికి దొంగలు తాళం వేశారు. మరో బెడ్ రూములో ఉన్న బీరువా తాళాలు తీసి 25 తులాల బంగారు ఆభరణాలు దొంగలించారు. తెల్లవారి 5గంటలకు నిద్రలేచిన శివశంకర్‌రెడ్డి బయటికి రావడానికి ప్రయత్నించగా తలుపులకు గడియ వేసివున్నట్లు గుర్తించారు. పక్కన ఉన్న బంధువులకు ఫోన్ చేయగా వారొచ్చి గడియ తీశారు. అప్పుడు ఇంట్లో దొంగలు పడ్డారని గ్రహించి, బీరువాలో బంగారు ఆభరణాలు చోరీ అయ్యాయని గుర్తించి వెంటనే టూటౌన్ పోలీసులకు సమాచారం ఇచ్చారు. టూటౌన్ సీఐ యుగంధర్, ఎస్ఐ ఇంటిని పరిశీలించి క్లూస్‌టీములతో వేలిముద్రల సేకరించారు. అలాగే పోలీసు జాగిలంతో పరిశీలించగా అది హౌసింగ్ బోర్డు నుంచి మడూరు రోడ్డు వరకు వచ్చి ఆగిపోయింది. దొంగలను పట్టుకోవడానికి ప్రత్యేక టీములతో గాలింపు మొదలుపెట్టారు. చుట్టుపక్కల ఉన్న సీసీ కెమెరాలను పరిశీలిస్తున్నారు. కాగా వారం కిందటే రూరల్ పోలీసుస్టేషను పరిధిలోని కొత్తపల్లె పంచాయతీ గెటెడ్ కమ్యూనిటీకి చెందిన లక్ష్మీనగర్ కాలనీలో తాళం వేసిన ఇంట్లో దొంగలు పడి భారీ దోపిడీకి పాల్పడ్డారు. దాదాపు 85 తులాల బంగారంతో పాటు 7లక్షల నగదు అపహరించుకుపోయారు. ఈ వరుస దొంగతనాలు ప్రొద్దుటూరు పోలీసులకు పెద్ద సవాల్‌గా మారాయి.



చోరీపై వివరాలు తెలుసుకుంటున్న సీఐ యుగంధర్

రేపు కలికిరికి మాజీ సీఎం

కలికిరి, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి ఏపీ మాజీ సీఎం, బీజేపీ నేత నల్లారి కిరణ్ కుమార్ రెడ్డి సోమవారం కలికిరి రానున్నట్లు ఆయన వ్యక్తిగత కార్యదర్శి ఎం.కృష్ణప్ప తెలిపారు. సోమవారం ఉదయం బెంగుళూరులో బయలుదేరి మధ్యాహ్నం 12కు కలికిరి చేరుకుంటారు. రాత్రి కలికిరిలోనే బస చేస్తారని, మంగళవారం ఉదయం 10.30కు కలికిరి నుంచి తిరుపతి విమానాశ్రయానికి బయలుదేరతారని తెలిపారు. తిరుపతి విమానాశ్రయం నుంచి మధ్యాహ్నం 12.30కు బయలుదేరి సాయంకాలం 3.50కు హైదరాబాదు నివాసం చేరుకుంటారు

విశ్వం ప్రిన్సిపాల్‌కు గౌరవ డాక్టరేట్

కురబలకోట, మార్చి 15(ఆంధ్రజ్యోతి): విశ్వం డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ రఘునాథరెడ్డికి అమెరికన్ గౌరవ డాక్టరేట్ ప్రదానం చేశారు. విద్యారంగంలో చేసిన సేవలను గుర్తించి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ టీచర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సిఫార్సు మేరకు ఇతనికి అమెరికన్ సెంట్రల్ యూనివర్శిటీ గౌరవ డాక్టరేట్‌ను ప్రదానం చేసింది. ఆయనను విశ్వం విద్యాసంస్థల చైర్మెన్ ప్రభాకర్‌రెడ్డి, సిబ్బంది అభినందించారు.

ఘనంగా శ్రీరామ్‌చినబాబు జన్మదిన వేడుకలు

- విషెస్ చెప్పిన సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్



శ్రీరామ్‌చినబాబుకు కేక్ తినిపిస్తున్న టీడీపీ నేత రాటకొండ బాబురెడ్డి

మదనపల్లె టౌన్, మార్చి 15(ఆంధ్రజ్యోతి): తెలుగు యువత రాష్ట్ర అధ్యక్షుడు శ్రీరామ్‌చినబాబు జన్మదిన వేడుకలను ఆయన అభిమానులు ఘనంగా నిర్వహించారు. శనివారం ఉదయం నీరుగట్టువారిపల్లెలోని చినబాబు నివాసంలో టీడీపీ సీనియర్ నేత రాటకొండ బాబురెడ్డి ఆధ్వర్యంలో శ్రీ రామ్‌చినబాబు కేక్ కట్ చేసి అభిమానులకు పంచిపెట్టారు. మాజీ ఎమ్మెల్యే దొమ్మాలపాటి రమేశ్, జనసేన రీజినల్ కోఆర్డినేటర్ గంగారపు రాందాస్‌చౌదరి, గంగారపు బాబురెడ్డి, గౌతమ్‌రెడ్డి, టీకేఎన్ నాయుడు, టీడీపీ నేతలు ఎస్ఏ మస్తాన్, దొరస్వామి, నాదెళ్ల రామచంద్రనాయుడు, కంచర్ల రంగస్వామినాయుడు, మహబూబ్‌ఖాన్, అరుణ్‌తేజ్, విష్ణు, బాబి తదితరులు చినబాబుకు శుభాకాంక్షలు తెలిపారు. చైతన్య అనాథాశ్రమంలో చిన్నారులకు అన్నదానం నిర్వహించారు. చౌడేశ్వరి సర్కిల్ వద్ద కేక్ కట్ చేసి టీడీపీ నేతలు సంబరాలు చేసుకున్నారు. వెలుగు వృద్ధాశ్రమంలో మాజీ సర్పంచ్ పఠాన్‌ఖాదర్‌ఖాన్ ఆధ్వర్యంలో వృద్ధులకు అన్నదానం చేశారు. కాగా సాయంత్రం సీఎం చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేశ్ సహా ఆరుగురు మంత్రులు చినబాబుకు విడివిడిగా ఫోన్ చేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

బస్‌షెల్టర్‌ను సద్వినియోగం చేసుకోవాలి

● ఎమ్మెల్సీ భూమిరెడ్డి రామగోపాల్‌రెడ్డి



శిలాఫలకం ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ భూమిరెడ్డి రామగోపాల్‌రెడ్డి

పులివెందుల టౌన్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): చికిత్స కోసం ఆస్పత్రికి వచ్చే ప్రజలు, రోగులు బస్‌షెల్టర్లను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్సీ భూమిరెడ్డి రామగోపాల్‌రెడ్డి అన్నారు. శనివారం కడపరోడ్డులోని సర్వజన ఆస్పత్రి వద్ద కొత్తగా నిర్మించిన బస్సుషెల్టరును ప్రారంభించిన ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో ఎక్కడా సాగు, తాగునీటి సమస్య లేకుండా చర్యలు తీసుకుంటామన్నారు. చక్రాయపేట మండలంలో తీవ్ర తాగునీటి ఎద్దడి ఉందని కలెక్టరు దృష్టికి తీసుకెళ్లడంతో ప్రస్తుతానికి బోర్లు వేశామని, ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి మరిన్ని నిధులు మంజూరు చేయించడానికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో పులివెందుల ఆర్‌అండ్‌బీ ఈఈ మాధవి, డీఈ జగదీశ్వర్‌రెడ్డి, మోపూరి దేవాలయం చైర్మన్ వెంకటరమణారెడ్డి, తొండూరు మాజీ మండల అధ్యక్షుడు ఎం.రమణారెడ్డి, కడప పార్లమెంటు కార్యదర్శి బొజ్జ మైసూరారెడ్డి, బీజేపీ నేత భానుప్రకాశ్, ఆర్‌అండ్‌బీ అధికారులు పాల్గొన్నారు.

'వివాదరహితంగా పాఠశాలల విలీన ప్రక్రియ'

పులివెందుల టౌన్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): వివాదరహితంగా పాఠశాలల విలీన ప్రక్రియ చేపడతామని పశ్చిమ రాయలసీమ జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ భూమిరెడ్డి రామగోపాల్‌రెడ్డి అన్నారు. పులివెందుల ఆర్‌అండ్‌బీ అతిథిగృహంలో శనివారం జిల్లా విద్యా శాఖాధికారి ఆధ్వర్యంలో ఏడు మండలాల విద్యాశాఖాధికారులతో నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు అసౌకర్యం కలగకుండా తల్లిదండ్రుల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని ముందుకు సాగుతామని, అవసరమైతే విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ దృష్టికి తీసుకెళ్లి సానుకూల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. డ్రాపౌట్స్ నివారణే లక్ష్యంగా చర్యలు చేపడుతున్నామన్నారు. కొత్త విధానంలో శాటిలైట్ ఫౌండేషనల్ స్కూలు, బేసిక్ ప్రైమరీ స్కూలు, మోడల్ ప్రైమరీ స్కూలు తదితర ఐదురకాల పాఠశాలలు ఏర్పాటు చేయడంపై అధికారులతో చర్చించారు. సమావేశంలో జిల్లా విద్యాశాఖాధికారి షంషుద్దీన్, మండల విద్యాశాఖ అధికారులు పాల్గొన్నారు.

పంటకుంటలను సద్వినియోగం చేసుకోవాలి

సీకేదిన్నె, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): రైతులు పంట కుంటలను సద్వినియోగం చేసుకోవాలని గ్రామీణాభివృద్ధి శాఖ జాయింట్ కమిషనర్ శివప్రసాద్ తెలిపారు. చింతకొమ్మదిన్నె మండలంలో జరుగుతున్న పంట కుంటలు, పండ్ల తోటల పెంపకం పనులను శనివారం ఆయన పరిశీలించారు. చింతకొమ్మదిన్నె, అశ్వత్థగారిపల్లెల్లో రైతులు నిర్మించుకుంటున్న పంట కుంటలను పరిశీలించి సలహాలు, సూచనలు అందించారు. ఆయన మాట్లాడుతూ పంట కుంటలు రైతులకు ఎంతో మేలని, ఇందులో నీరు పంటలకు చక్కగా ఉపయోగించుకోవచ్చన్నారు. కుంట సమీపంలో వివిధ రకాల మొక్కలు పెంచుకుని రైతులు అదనపు ఆదాయం పొందవచ్చన్నారు. రైతుకు ఎటువంటి ఖర్చు లేకుండా ఉపాధి హామీ ద్వారా ఈ పంట కుంటలు నిర్మించుకోవచ్చని తెలిపారు. ఎండలు ఎక్కువగా ఉన్నందున ఉదయం ఆరు గంటలకే పనులకు వచ్చి కొలతల ప్రకారం పనులు చేసుకోవాలన్నారు. మండలంలో 33 పంట కుంటలు మంజూరయ్యాయన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కుళాయిబాబు, ఏపీడీ సోమశేఖర్‌రెడ్డి, ఏపీఓ రామాంజనేయులరెడ్డి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మున్సిపాలిటీకి రూ.90లక్షల ఆదాయం

పులివెందుల టౌన్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): పులివెందుల పురపాలక సంఘానికి సంబంధించి 2025-26 సంవత్సరానికి బహిరంగ వేలం ద్వారా రూ.90,11,000 ఆదాయం వచ్చిందని మున్సిపల్ కమిషనరు రాముడు తెలిపారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో శనివారం దిన, వారపు సంత మార్కెట్‌లో వాహనాల ఫీజులు, జంతు వధశాలకు బహిరంగ వేలం నిర్వహించారు. దిన, వారపు సంత మార్కెట్‌ను సి.శ్రీనివాసరెడ్డి రూ.51,35,000లకు, నిలుపబడిన వాహనాల ఫీజు వసూలును ఈ.పద్మావతి రూ.34,35,000లకు, జంతు వధశాలను సుశీలమ్మ రూ.4,41,000లతో దక్కించుకున్నారు. దీంతో గతేడాది కంటే రూ.12,77,000 అధికంగా పురపాలక సంఘానికి ఆదాయం వచ్చిందని కమిషనరు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, మున్సిపల్ సిబ్బంది, వేలం దారులు పాల్గొన్నారు.

ఘనంగా కాన్షీరాం జయంతి

పీలేరు, మార్చి 15(ఆంధ్రజ్యోతి): బహుజన సమాజ్ పార్టీ(బీఎస్‌పీ) వ్యవస్థాపక అధ్యక్షుడు కాన్షీరాం జయంతిని శనివారం భారతీయ అంబేడ్కర్ సేన(బాస్) శ్రేణులు ఘనంగా నిర్వహించారు. పీలేరులోని తమ కార్యాలయంలో ఆయన చిత్రపటాన్ని ఆవిష్కరించి నివాళులర్పించారు. డీవీఎంసీ సభ్యులు పాలకుంట శ్రీనివాసులు మాట్లాడుతూ అంబేడ్కర్ కలలుగన్న బహుజనుల రాజ్యాధికారం కోసం ఉద్యోగం వదులుకోవడమే కాకుండా జీవితాంతం అవివాహితుడిగా మిగిలిపోయిన కాన్షీరాం నేటి తరాలకు ఆదర్శప్రాయుడన్నారు. కార్యక్రమంలో ముల్లంగి కృష్ణయ్య, హరినాథ, గురువయ్య, రామకృష్ణ, హరీశ్, కిశోర్, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మదనపల్లె పట్టణంలో...

మదనపల్లె అర్బన్, మార్చి 15(ఆంధ్రజ్యోతి): పట్టణంలో పలు చోట్ల కాన్షీరాం జయంతిని ఘనంగా నిర్వహించారు. శనివారం బాస్ వ్యవస్థాపక అధ్యక్షుడు పీటీఎం శివప్రసాద్ ఆధ్వర్యంలో స్థానిక కార్యాలయంలో కాన్షీరాం జయంతిని పురస్కరించుకుని చిత్రపటానికి నివాళులర్పించారు. బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు బందెల గౌతమ్‌కుమార్ ఆధ్వర్యంలో బీఎస్పీ నేత మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. బహుజన సేన రాష్ట్రఅధ్యక్షుడు శ్రీచందు ఆధ్వర్యంలో స్థానిక బహుజనసేన మెట్రో కార్యాలయంలో కాన్షీరాం జయంతిని నిర్వహించారు.

ప్లాస్టిక్ వినియోగం తగ్గించండి

అట్టహాసంగా 'స్వచ్ఛ ఆంధ్ర - స్వచ్ఛ దివస్' ● ర్యాలీలు, పరిసరాలను శుభ్రపరిచిన సిబ్బంది
మానవహారంలా నిలిచిన అధికారులు, ప్రజలు ● ప్లాస్టిక్ రహిత సమాజం కోసం ప్రతిజ్ఞ

సమాజంలో ప్లాస్టిక్‌ను రూపుమాపి, ప్లాస్టిక్ రహిత గ్రామాలుగా తీర్చిదిద్దాలని అధికారులు ప్రజలతో ప్రతిజ్ఞ చేయించారు. శనివారం 'స్వచ్ఛ ఆంధ్ర - స్వచ్ఛ దివస్'ను అట్టహాసంగా నిర్వహించారు. పలుప్రభుత్వ కార్యాలయాల పరిసరాలను శుభ్రంగా తయారు చేశారు. అనంతరం చెత్త నిర్వహణను కట్టుదిట్టంగా నిర్వహించి పర్యావరణాన్ని కాపాడతామని ప్రతిన బూనారు. వివరాల్లోకెళితే...





పెద్దమండ్యంలో మాట్లాడుతున్న అధికారులు - పీలేరులో ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు, విద్యార్థులు, పార్టీల ప్రతినిధులు



కలకడలో అధికారులు, ప్రజలతో ఏర్పడిన మానవహారం

పెద్దమండ్యం, మార్చి 15(ఆంధ్రజ్యోతి): ప్లాస్టిక్ రహిత గ్రామాలుగా తీర్చిదిద్దడానికి సమష్టిగా కృషి చేయాలని ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ చంద్రశేఖర్, పెద్దమండ్యం తహసీల్దార్ సయ్యద్ ఆహ్మద్ పిలుపు నిచ్చారు. స్వర్ణాంధ్ర-స్వచ్ఛ దివస్ కార్యక్రమాల్లో భాగంగా మండల అధికారులు, విద్యార్థులు, స్థానికులు ర్యాలీ నిర్వహించి మానవహారం చేపట్టారు. ప్లాస్టిక్ వాడకంతో భవిష్యత్తులో మానవాళికి ప్రమాదం వుందన్నారు. తహసీల్దార్ సయ్యద్‌ఆహ్మద్, ఎంపీడీఓ శ్రీధర్‌రావు, సర్పంచ్ బాష, ఏఈలు అశోక్, అక్రం, కార్యదర్శి సుబ్రమణ్యం కూటమి నేతలు గల్లా నారాయణ, ఫరూక్, గంగాధర, మహేశ్వర, విద్యార్థులు పాల్గొన్నారు.

మదనపల్లెలో...

మదనపల్లె టౌన్, మార్చి 15(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో ప్రజలు ప్లాస్టిక్ కవర్ల వినియోగం తగ్గించాలని మండల ప్రత్యేకాధికారి సహాయ బీసీ సంక్షేమశాఖాధికారి సబితరాణి పేర్కొన్నారు. కురవంక సర్పంచ్ చిప్పిలి చలపతి ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఎంపీడీఓ తాజ్‌మస్రూర్ మాట్లాడుతూ ప్లాస్టిక్ కవర్ల వినియోగంలో ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాలను ప్రజలు పాటించాలన్నారు. పంచాయతీ కార్మికులు, ప్రజలతో ప్రతిజ్ఞ చేయించారు. ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ కృష్ణవేణి ఆధ్వర్యంలో విద్యార్థినులు స్వచ్ఛ ఆంధ్ర - స్వచ్ఛదివస్ నిర్వహించారు. మోహనవల్లి, ఖాజావలి పాల్గొన్నారు.

నిమ్మనపల్లిలో...

నిమ్మనపల్లి, మార్చి 15(ఆంధ్రజ్యోతి): బస్టాండులో ప్రత్యేక అధికారి ప్రసాద్ ఆధ్వర్యంలో మానవహారం, ర్యాలీ చేపట్టారు. పంచాయతీ కార్యాలయం ఆవరణలో చెత్తను శుభ్రం చేశారు. ఎంపీడీఓ పరమేశ్వర్‌రెడ్డి, ఏఓ రమేష్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ మిధున్‌చక్రవర్తి, ఏపీఓ రమేష్, సిబ్బంది గుర్రప్ప పాల్గొన్నారు.

రామసముద్రంలో...

రామసముద్రం, మార్చి 15(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో ఎంపీడీఓ భానుప్రసాద్, ఏపీఎం సాంబశివ ఆధ్వర్యంలో స్వచ్ఛ ఆంధ్ర, స్వచ్ఛ దివస్ నిర్వహించారు. అధికారులు, సచివాలయ సిబ్బంది, పారిశుధ్య కార్మికులు మండల కార్యాలయం నుంచి ర్యాలీగా వెళ్లి అంబేడ్కర్ సర్కిల్‌లో మానవహారం నిర్వహించారు. ఇరిగేషన్ డీఈ సురేష్, ఏఈ శ్రీధర్, ఏపీఎం సాంబశివ, సీసీ గంగాధర్, కార్యదర్శి మునిస్వామినాయక్ పాల్గొన్నారు.

ములకలచెరువులో...

ములకలచెరువు, మార్చి 15(ఆంధ్రజ్యోతి): స్వచ్ఛ ఆంధ్ర - స్వచ్ఛ దివస్‌లో భాగంగా విద్యార్థులతో కలిసి అధికారులు భారీ ర్యాలీ నిర్వహించారు. మండల ప్రజా పరిషత్ కార్యాలయం నుంచి పెట్రోల్ బంకు, ఆర్టీసీ బస్టాండు మీదుగా బస్టాండు సర్కిల్ వరకు ప్రదర్శన చేపట్టారు. అనంతరం బస్టాండు సర్కిల్‌లో మానవహారంగా నిలబడి ప్రతిజ్ఞ చేశారు. ఎంపీడీఓ హరినారాయణ, ఎస్‌ఐ నరసింహుడు, ఎంఈఓ వెంకటరమణ, ఏపీఎం మధుశేఖర్‌బాబు, సర్పంచ్ రహమత్‌బీ పాల్గొన్నారు.

తంబళ్లపల్లెలో...

తంబళ్లపల్లె, మార్చి 15(ఆంధ్రజ్యోతి): ప్లాస్టిక్ నిషేధం అందరి బాధ్యత అని, బట్ట సంచులను వినియోగించాలని జిల్లా పశు సంవర్ధక శాఖ జేడీ, మండల ప్రత్యేకాధికారి గుణశేఖర్ పిళ్లై అన్నారు. ప్లాస్టిక్ కవర్ల వాడకంతో కలిగే అనర్థాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఎంపీడీఓ కార్యాలయం నుంచి కూటమి నేతలు, మండల అధికారులు, విద్యార్థులతో కలసి ప్లకార్డులుతో ర్యాలీ నిర్వహించారు. హరిత సర్కిల్‌లో మానవహారం ఏర్పడి ప్రతిజ్ఞ చేశారు. ఎంపీడీఓ ఉపేంద్రారెడ్డి, ఎంఈఓ త్యాగరాజు, ఏపీఓ అంజనప్ప, ఏపీఎం గంగాధర్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ వినోద్, టీడీపీ మండలాధ్యక్షుడు రెడ్డప్పరెడ్డి, సిద్ధమ్మ, ఉత్తమ్‌రెడ్డి, వీరాంజనేయులు, పురుషోత్తం, నరసింహులు, రామ్మోహన్‌రెడ్డి, వికలాంగ అధ్యక్షుడు రామాంజులు తదితరులు పాల్గొన్నారు.

పెద్దతిప్పసముద్రంలో...

పెద్దతిప్పసముద్రం మార్చి 15 (ఆంధ్రజ్యోతి): ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించుకుందాం - ప్రకృతిని రక్షించుకుందామని మండల ప్రత్యేక అధికారి మునిరాజ్ వెల్లడించారు. కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది, గ్రీన్ అంబాసిడర్లు, మండల అధికారులు, ప్రజాప్రతినిధులతో కలిసి పురవీధుల్లో భారీ ర్యాలీ నిర్వహించారు. ఎంపీడీఓ అబ్దుల్ కలాం ఆజాద్, వెలుగు ఏపీఎం హరి, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ బాలచంద్రాచారి, హౌసింగ్ ఏఈ శ్రీనివాసులు పాల్గొన్నారు.

పీలేరులో...

పీలేరు, మార్చి 15(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ దివస్' కార్యక్రమాన్ని మండల అధికారులు అట్టహాసంగా నిర్వహించారు. అధికారులు, పలు పార్టీల ప్రతినిధులు, వైద్య ఆరోగ్య శాఖ, ఏపీ ట్రాన్స్‌కో సిబ్బంది, పారిశుధ్య కార్మికులు, విద్యార్థులతో కలిసి ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన ర్యాలీలు జరిపారు. అధికారులు మాట్లాడుతూ రాష్ట్రాన్ని దేశంలోనే అత్యంత పరిశుభ్రత కలిగిన రాష్ట్రంగా తీర్చిదిద్దాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రతి మూడో శనివారం 'స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ దివస్' కార్యక్రమాన్ని చేపట్టారన్నారు. పంచాయతీ కార్యాలయం నుంచి నాలుగు రోడ్ల కూడలి వరకు ర్యాలీ నిర్వహించి మానవహారం చేపట్టారు. అనంతరం చెత్త నిర్వహణను పకడ్బందీగా నిర్వహించి పర్యావరణాన్ని కాపాడతామని ప్రతిజ్ఞ బూనారు. కార్యక్రమాల్లో ఏపీ పంచాయతీ కార్మికుల యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు ధనాశి వెంకటరామయ్య, ఎంపీడీఓ శివశంకర్, ఈఓపీఆర్‌ఆర్‌డీ లతీఫ్ ఖాన్, కార్యదర్శులు జ్ఞానశేఖర్, శివాజీ, శానిటరీ అధికారి నౌషాద్ అహ్మద్, టీడీపీ నేతలు పురం రామ్మూర్తి, పోలిశెట్టి సురేంద్ర, రహంతుల్లా, నౌలాక్, బుజ్జు, తదితరులు పాల్గొన్నారు.

వాల్మీకిపురంలో...

వాల్మీకిపురం, మార్చి 15(ఆంధ్రజ్యోతి): ప్లాస్టిక్ వాడకం ప్రమాదకరమని ప్రభుత్వాస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రవికుమార్ అన్నారు. స్వచ్ఛ ఆంధ్ర - స్వచ్ఛదివస్‌పై అవగాహన చేపట్టారు. వైద్యులు, సిబ్బందితో కలిసి ఆస్పత్రి ఆవరణలో శ్రమదానం చేశారు. కార్యక్రమాల్లో ఎంపీడీఓ మనోహర్‌రాజు, ఈఓ రవీంద్రనాథ్, కురబ కార్పొరేషన్ డైరెక్టర్ వల్లిగట్ల వెంకటరమణ, మండల టీడీపీ అధ్యక్షుడు మల్లికార్జునరెడ్డి, సర్పంచ్ గంగులమ్మ, ఉపసర్పంచ్ కేశవరెడ్డి, డాక్టర్లు హర్షిత, మమత, శివాణి, సోని, ఆసిఫ్, ప్రజలు పాల్గొన్నారు.

కలకడలో...

కలకడ, మార్చి 15(ఆంధ్రజ్యోతి): ప్రజలు బాధ్యతగా పర్యావరణ రక్షణకు నడుంబిగించాలని మండల ప్రత్యేకాధికారి భరత్ కుమార్‌రెడ్డి, ఎంపీడీఓ అబ్దుల్ రహీం పిలుపునిచ్చారు. శనివారం కలకడలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం వ్యాపారులకు కరపత్రాలను పంపిణీ చేసి బస్టాండు కూడలిలో మానవహారం చేశారు. కార్యక్రమంలో కార్యదర్శి దేవేంద్ర, ప్రజాప్రతినిధులు, కార్మికులు పాల్గొన్నారు.









కురవంకలో ప్రతిజ్ఞ చేయిస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు - ప్లాస్టిక్‌పై ప్రజలకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం - రామసముద్రంలో చెత్తను తొలగిస్తున్న ఎంపీడీఓ భానుప్రసాద్ - కలకడలో వ్యాపారులకు కరపత్రాలను అందజేస్తున్న అధికారులు

'పది' పరీక్షలకు సర్వం సిద్ధం



ఏర్పాట్లు పరిశీలిస్తున్న ఎంఈఓలు

పీలేరు, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): టెన్త్ పరీక్షలకు పీలేరు మండలంలో సర్వం సిద్ధం చేసినట్లు ఎంఈఓలు లోకేశ్వర రెడ్డి, పద్మావతమ్మ తెలిపారు. పరీక్షా కేంద్రమైన పీలేరు మెయిన్ స్కూలులో శనివారం ఏర్పాట్లను పరిశీలించిన వారు మాట్లాడుతూ సోమవారం నుంచి జరగనున్న పరీక్షలకు మండలంలో 1487 మంది విద్యార్థులు హాజరు కానున్నారని, వారి కోసం తొమ్మిది కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు వివరించారు. పరీక్షలు ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.45 వరకు జరుగుతాయని, విద్యార్థులు అరగంట ముందే పరీక్షా కేంద్రానికి చేరుకోవాలని సూచించారు. ప్రతి పరీక్షా కేంద్రం వద్ద 144 సెక్షన్ అమల్లో ఉంటుందని, 100 మీటర్లలోపు జిరాక్స్ సెంటర్లు మూసివేయాలని సూచించారు. ప్రతి సెంటర్‌లోనూ సిట్టింగ్ స్క్వాడ్ ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో మెయిన్ స్కూలు హెచ్‌ఎం సురేంద్రనాథరెడ్డి, ఉపాధ్యాయులు పోతంశెట్టి రమేశ్, తదితరులు పాల్గొన్నారు.

నేడు మామిడి రైతులకు శిక్షణ తరగతులు

పీలేరు, మార్చి 15(ఆంధ్రజ్యోతి): పీలేరు, కేవీపల్లె మండలాల్లోని మామిడి రైతులకు పీలేరులో ఒకరోజు శిక్షణ ఏర్పాటు చేసినట్లు ఉద్యానశాఖాధికారి సుకుమార్ రెడ్డి తెలిపారు. ఆదివారం ఉదయం 10 గంటలకు సీఎస్‌ఆర్ డిగ్రీ కళాశాలలో శిక్షణ ఉంటుందన్నారు. ఇందులో పూత, పిందె దశల్లో చేపట్టాల్సిన యాజమాన్య పద్ధతులు, మామిడి కాయలకు కవర్ల ఏర్పాటుపై రైతులకు శిక్షణ ఇవ్వనున్నట్లు ఆయన తెలిపారు. జిల్లా ఉద్యాన శాఖాధికారి రవిచంద్ర, కలికిరి కేవీకే శాస్త్రవేత్త డాక్టర్ శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగే శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

ఉపాధి పనుల్లో వలంటీర్లే కూలీలు

● రూ. 3.36 లక్షల రికవరీకి ఆదేశాలు



ప్రజా వేదిక వద్ద ఉపాధి పనుల అక్రమాలను విచారిస్తున్న పీడీ వెంకటరత్నం

కలికిరి, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): మండలంలో పలు పంచాయతీల్లో జరిగిన ఉపాధి పనుల్లో వలంటీర్ల పేరుతో యథేచ్ఛగా రోజువారీ మస్టర్లు వేసినట్లు గుర్తించారు. కొన్ని చోట్ల ఉద్యోగులు, మరి కొన్ని చోట్ల చనిపోయిన వారిని కూడా కూలీలుగా హాజరైనట్లు చూపించారు. మండలంలో 2023-24లో జరిగిన ఉపాధి హామీ పనుల్లో పలు అవకతవకలు జరిగాయని ఫీల్డ్ అసిస్టెంట్లు చేతివాటానికి పాల్పడ్డట్లు గుర్తించామని సామాజిక తనిఖీ బృందాలు వెల్లడించాయి. ఈ నెల 3 నుంచి 13వ తేదీ వర కూ పనులను పరిశీలించారు. జరిగిన అవతవకలపై నిగ్గు తేల్చారు. మండలంలో మొత్తం రూ.7,84,32,787 విలువైన 1399 పనులు చేసినట్లు డ్వామా పీడీ వెంకటరత్నం తెలిపారు. ఆయన సమక్షంలోనే సామాజిక తనిఖీపై బహిరంగ ప్రజా వేదిక నిర్వహించారు. జరిగిన పనుల్లో రూ. 3,35,935లు దుర్వినియోగం జరిగినట్లు గుర్తించామని పీడీ వివరించారు. మేడికుర్తిలో రూ.1,08,429లు, చీకటిపల్లెలో రూ.1,04,891, పత్తేగడలో రూ.39,971లు, మునేళ్లపల్లెలో రూ.20,813లు, గుండ్లూరులో రూ.18,206, మహల్‌లో రూ.14,474లు, పారపట్లలో రూ.12,856లు వంతున అక్రమాలు చోటు చేసుకున్నాయి. బాధ్యుల నుంచి దుర్వినియోగమైన నిధులు రాబడతామని పీడీ తెలిపారు.

ఈ ప్రజా వేదికలో ఏపీడీ శ్రీనివాసులు, ఎంపీడీఓ భానుమూర్తి రావు, ఏపీఓ సుజాత, రాష్ట్ర రిసోర్స్ పర్సన్ డి.మురాద్, జిల్లా రిసోర్స్ పర్సన్‌లు, టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు, పలువురు ప్రజా ప్రతినిధులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

గజవాహనంపై లక్ష్మీనరసింహస్వామి



పెద్దమండ్యం, మార్చి 15(ఆంధ్రజ్యోతి): పాపేపల్లి లక్ష్మీ నరసింహస్వామి బ్రహ్మోత్సవాల్లో శనివారం రాత్రి స్వామి వారు గజవాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. ప్రజలు ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం స్వామి వార్లకు ప్రత్యేక పూజలు, అభిషేకం నిర్వహించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. పగలు గ్రామోత్సవం నిర్వహించారు. ఆలయ అర్చకులు విష్ణుమాచార్యులు, యాజ్ఞకులు రఘునాధాచార్యులు, ఉభయదారులు యల్లం రెడ్ల కుటుంబీకులు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

మహిళల భద్రత కోసమే సహాయ డెస్క్

వాల్మీకిపురం, మార్చి 15(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం మహిళల భద్రత, రక్షణ కోసమే మహిళా సహాయ డెస్క్ ఏర్పాటు చేశారని వాల్మీకిపురం ఎస్‌ఐ చంద్రశేఖర్ పేర్కొన్నారు. శనివారం స్థానిక పోలీస్‌స్టేషన్ ఆవరణలో అవగాహన నిర్వహించారు. ఈసందర్భంగా మహిళలకు కరపత్రాలు పంపిణీ చేశారు. ఆపదలో ఉన్న సమయంలో తక్షణమే మహిళలు 112నెంబరుకు డయల్ చేయాలని, 181, 1930, 1098 నెంబర్లకు సైతం కాల్ చేసి పోలీసుల సాయంతో రక్షణ పొందవచ్చన్నారు. పోలీస్ సిబ్బంది మహిళలు పాల్గొన్నారు.

రక్షణ కవచం 'శక్తి' యాప్

ములకలచెరువు, మార్చి 15(ఆంధ్రజ్యోతి): మహిళల భద్రత కోసం ప్రభుత్వం శక్తి యాప్‌ను తీసుకొచ్చిందని ఎస్‌ఐ నరసింహుడు పేర్కొన్నారు. స్థానిక వెలుగు కార్యాలయంలో డ్వాక్రా మహిళలకు శక్తి యాప్‌పై అవగాహన కల్పించారు. ఎంపీడీఓ హరినారాయణ, ఏపీఎం మధుశేఖర్‌బాబు పాల్గొన్నారు.

పేటెంట్‌పై అవగాహన అవసరం



పేటెంట్ హక్కులపై అవగాహన కల్పిస్తున్న అశోక్

కురబలకోట, మార్చి 15(ఆంధ్రజ్యోతి): పేటెంట్ హక్కులపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంపొందించుకోవాలని ఐపీఆర్ ట్రైబ్ డైరెక్టర్ అశోక్ పేర్కొన్నారు. శనివారం మిట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో మేధో సంపత్తి సౌకర్యాల కేంద్రం ఆధ్వర్యంలో జాతీయ ఐపీ ఔట్రీచ్ మిషన్‌లో ఐపీపై అవగాహన నిర్వహించారు. అనంతర సమావేశంలో ఆయన మాట్లాడుతూ అభివృద్ధి చెందుతున్న మనదేశంలో పరిశోధనలు, ట్రేడ్ మార్క్స్, ఉత్పత్తులకు పేటెంట్ హక్కులను పొందాలన్నారు. చట్టబద్ధంగా హక్కులు పొందకపోతే అనేక నష్టాలను చవిచూడాల్సి వస్తుందన్నారు. ప్రధానంగా తాము తయారు చేసిన యంత్రాలు, వస్తువులకు హక్కులు పొందకపోతే మరొకరు దొంగిలించి ఆ హక్కులను పొందే అవకాశం ఉంటుందన్నారు. కావున ప్రతి ఒక్కరిలో మార్పులు తీసుకురావడానికి ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని, సామాన్యుల నుంచి పారిశ్రామిక వేత్తల వరకు ఈ నిబంధనలు వర్తిస్తాయన్నారు. ప్రిన్సిపాల్ సి.యువరాజ్, డీన్ తులసీరామ్‌నాయుడు, కో ఆర్డినేటర్ శివయ్య తదితరులు పాల్గొన్నారు.


గౌరవంగా జీవించండి



సమావేశంలో మాట్లాడుతున్న జోగేంద్ర

కలకడ, మార్చి 15(ఆంధ్రజ్యోతి): ప్రజలు సమాజంలో గౌరవంగా జీవించేలా తమ నడవడికను మార్చుకోవాలని జిల్లా అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ వై.జోగేంద్ర అన్నారు. దిగువతండా పంచాయతీలో శనివారం నవోదయం-2లో భాగంగా ప్రజలకు అవగాహన కల్పించిన ఆయన మాట్లాడుతూ సారా అమ్మకాలను వదిలి ప్రజలు సమాజంలో ఉన్నతంగా జీవించాలని పిలుపునిచ్చారు. అప్పుడే పిల్లల భవిష్యత్‌కు మంచి మార్గాలు ఉంటాయని తెలిపారు. ప్రభుత్వం నుంచి తండా ప్రజలకు బతుకుదెరువు చూపిస్తామన్నారు. పీలేరు ఎక్సైజ్ సీఐ సుబ్బారెడ్డి, ఎస్‌ఐలు, నాయకులు పాల్గొన్నారు.

బోరుకు మోటారు ఏర్పాటు



కొత్త మోటారు బిగిస్తున్న దృశ్యం

పెద్దమండ్యం, మార్చి 15(ఆంధ్రజ్యోతి): సిద్దవరం కస్తూర్బా గురుకుల పాఠశాలలో తాగునీటి బోరుకు కొత్త మోటారు ఏర్పాటు చేసినట్లు కూటమి నేతలు సిద్దవరం ఎంపీటీసీ రుక్మాంగదరెడ్డి, టీడీపీ మండల మాజీ అధ్యక్షుడు సిద్దవరం ప్రసాద్ పేర్కొన్నారు. పాఠశాలలో ఇటీవల తరచూ తాగునీటి బోరు మరమ్మతులకు గురవుతూ విద్యార్థులు పలుమార్లు ఇక్కట్లు పడుతున్నట్లు ఉపాధ్యాయులు తెలిపారు. తంబళ్లపల్లి టీడీపీ ఇన్‌చార్జ్ జయచంద్రారెడ్డి సహకారంతో బోరుకు కొత్త మోటారు, పైపులు బిగించి తాగునీటి సమస్య పరిష్కారానికి కృషి చేసినట్లు తెలిపారు. కూటమి నేతలు బాజ్‌బాన్, విశ్వనాధ, రామాంజులు నాయుడు, రామాంజులు, సాంబ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

స్వచ్ఛ మరుగుదొడ్లను సద్వినియోగం చేసుకోండి



స్వచ్ఛ మరుగుదొడ్లకు మార్కింగ్ ఇస్తున్న ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ

పెద్దతిప్పసముద్రం మార్చి 15 (ఆంధ్రజ్యోతి): స్వచ్ఛ ఆంధ్ర - స్వచ్ఛ దివస్‌లో భాగంగా కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న స్వచ్ఛ మరుగుదొడ్లను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ బాలచంద్రాచారి పేర్కొన్నారు. వీటీఎం హరిజనవాడలో లబ్ధిదారులకు మరుగుదొడ్ల వినియోగంతో కలిగే ప్రయోజనాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రభుత్వం మండలానికి 127 మరుగుదొడ్లను మంజూరు చేసిందని, మండలంలోని వివిధ గ్రామాల్లో 25 మరుగుదొడ్లను లబ్ధిదారులు పూర్తి చేశారన్నారు. 30 మరుగుదొడ్లు వివిధ దశల్లో ఉన్నాయన్నారు. ఒక్కో మరుగుదొడ్డికి ప్రభుత్వం రూ. 15 వేలు అందిస్తుందని, ఇంకా నిర్మించుకునే వారు ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులను సంప్రదించాలని ఆయన కోరారు.

వినియోగదారుల హక్కులు తెలుసుకోండి

మదనపల్లె టౌన్, మార్చి 15(ఆంధ్రజ్యోతి): ప్రజలు వినియోగదారుల హక్కుల గురించి అవగాహన పెంచుకోవాలని ఆదిత్య కళాశాల డైరెక్టర్ రామలింగారెడ్డి అన్నారు. శనివారం వినియోగదారుల దినోత్సవం సందర్భంగా గ్రామాల్లో విద్యార్థులు ప్రజలకు అవగాహన కల్పిస్తూ వీధి నాటకాలు నిర్వహించారు. ప్రిన్సిపాల్ సతీష్‌బాబు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

'పాలిసెట్' ఉచిత శిక్షణ

కలికిరి, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): పాలిటెక్నిక్ కళాశాలల్లో ప్రవేశాల కోసం త్వరలో జరుగనున్న పాలిసెట్-2025 అర్హత పరీక్షకు హాజరయ్యే అభ్యర్థుల కోసం కలికిరి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఉచిత కోచింగ్ తరగతులు నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ శ్రీనివాసులు పేర్కొన్నారు. ఏప్రిల్ 1 నుంచి 25వ తేదీ వరకూ అనుభవజ్ఞులైన అధ్యాపకులచే ఈ తరగతులు నిర్వహించనున్నామని చెప్పారు. శిక్షణకు హాజరయ్యే విద్యార్థులకు స్టడీ మెటీరియల్ ఉచితంగా అందిస్తామన్నారు. శిక్షణలో మోడల్ పరీక్ష నిర్వహిస్తామని ప్రిన్సిపాల్ ఒక ప్రకటనలో కోరారు.